## నేటి కందం-నేటికి అందం

**టాటా కన్సల్టెన్సీ**
**డేటా సెంటరును మన సిటీలో నిడుచున్**
**వాటమ్ముగ ఏ ఐ కొక**
**కోటను నిర్మించు ఘనుల కోరి నుతింతున్ !!**

(మన హైదరాబాద్ సిటీ లో టాటా కన్సల్టెన్సీ వారు డేటా సెంటరును డెబ్బై వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్నారు. దీని వలన ఎన్నో ఉద్యోగాలు,ఎంతో ఆర్థిక ప్రగతి మన హైదరాబాద్ కు కలుగుతుంది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

## చురక

**స్పీకర్ ను పరువుదీసి**
**శిలువవేసే బూతు తిట్లు**
**ప్రజాస్వామ్య భవిష్యత్తుకు**
**పడుతున్న కత్తి పోట్లు.**
**ప్రతిపక్షం అధికారం**
**ప్రతీ నేత భాషణం**
**అదుపులుంటే వారికి**
**అదే గొప్ప భూషణం**



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 9-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:32 పేజీలు:6 వెల: రూ.1/-


# హౌతీల మెరుపు దాడి

**4 సౌదీ సిటీలే బీభత్సం**
**డ్రోన్లు.. క్షిపణులతో స్వైర విహారం**
**73 మందికి గాయాలు**
**చమురు స్థావరాల్లో మంటలు**
**ఆరు నెలల యుద్ధంలో కీలక మలుపు**
**మళ్లీ భగ్గుమన్న గల్ఫ్..**
**బ్యారెల్ చమురు ధర 99 డాలర్లకు పైనే**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:మధ్యప్రాచ్యంలో ఆరు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం మరింత విస్తరిస్తోంది. ఇరాన్ మద్దతున్న యెమెన్ హౌతీలు అమెరికా మిత్రదేశమైన సౌదీ అరేబియాపై మంగళవారం భారీ దాడులకు తెగబడ్డారు. దేశంలోని దక్షిణ ప్రాంతంలోని నాలుగు నగరాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, క్షిపణులతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 73 మంది గాయపడినట్లు సౌదీ అధికారులు వెల్లడించారు. పలు చమురు సంబంధిత స్థావరాల్లో మంటలు చెలరేగాయి. ఫిబ్రవరిలో అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించిన తర్వాత సౌదీపై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది ఒకటిగా భావిస్తున్నారు.

## 4 నగరాలే లక్ష్యం

హౌతీల ఆధీనంలో యెమెన్‌లోని జనాభా అధికంగా నివసించే ప్రాంతాలతో పాటు రాజధాని సనాతో సహా విస్తారమైన భూభాగం ఉంది. మంగళవారం సౌదీ భూభాగంలోకి లోతుగా చొచ్చుకెళ్లేలా విస్తృత దాడులు చేపట్టినట్లు హౌతీలు ప్రకటించారు. దక్షిణ సౌదీలోని ఖమీస్ ముషైత్ వైమానిక స్థావరాన్ని డ్రోన్లు, క్షిపణులతో లక్ష్యంగా చేసుకున్నారు. సమీపంలోని అభా, యెమెన్ సరిహద్దులోని నజ్రాన్, ఎర్ర సముద్ర తీరంలోని కీలక నౌకాశ్రయ నగరం జజాన్‌పైనా దాడులు జరిగాయి. జజాన్‌లో భారీ చమురు శుద్ధి కర్మాగారం, విద్యుత్ కేంద్రం ఉన్నాయి.

## మహిళలు, చిన్నారులకూ గాయాలు

దాడుల అనంతరం ఆయా ప్రాంతాల్లో మంటలు చెలరేగినట్లు సౌదీ అధికారులు తెలిపారు. గాయపడిన 73 మందిలో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నట్లు వెల్లడించారు. అయితే దాడుల అనంతర దృశ్యాలను స్వతంత్రంగా నిర్ధారించేందుకు వెంటనే వీలు కాలేదు. సౌదీలో మీడియాపై ఆంక్షలు ఉండటంతో ప్రత్యక్ష సాక్షులను సంప్రదించడం కూడా సాధ్యపడలేదని సమాచారం.

## మళ్లీ గల్ఫ్ పోరు షురూ

ఆగస్టులో దాదాపు నెల రోజుల పాటు కొంత ప్రశాంతంగా ఉన్న గల్ఫ్ ప్రాంతంలో మళ్లీ పోరు మొదలైంది. అమెరికా, ఇరాన్ పరస్పరం దాడులు చేసుకోవడంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ఆందోళన పెరిగింది. మంగళవారం బ్రెంట్ క్రూడ్ ధరలు 2 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 99 డాలర్లను దాటాయి.

హౌతీల తాజా దాడులు యుద్ధ ప్రభావాన్ని మరింత విస్తరించే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ఇరాన్ ఆధిపత్యంలో ఉన్నట్లు చెబుతున్న హోర్ముజ్ జలసంధి సమస్యకు తోడు.. ఎర్ర సముద్రం వైపు కూడా ఇంధన సరఫరాలకు ముప్పు ఏర్పడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

## యెమెన్‌లోనూ మళ్లీ మంటలు

హౌతీలపై దశాబ్దానికి పైగా సౌదీ అరేబియా నేతృత్వంలోని అరబ్ కూటమి పోరాడుతోంది. ఇటీవలి సంవత్సరాల్లో అక్కడ ఉద్రిక్తత కొంత తగ్గినప్పటికీ.. తాజాగా కాల్పుల విరమణ విచ్ఛిన్నమైంది. ఎర్ర సముద్ర ప్రవేశ మార్గంలో నౌకల రాకపోకలను అడ్డుకుంటామని హౌతీలు హెచ్చరిస్తున్నారు.

యెమెన్ పశ్చిమ తీరంలో గత మూడు రోజుల్లో జరిగిన పోరుతో 18,500 మందికి పైగా ప్రజలు ఇళ్లను విడిచి వెళ్లినట్లు అంతర్జాతీయ వలస సంస్థ తెలిపింది.

## తగిన చర్యలు తీసుకుంటాం

హౌతీల దాడులపై సౌదీ నేతృత్వంలోని కూటమి తీవ్రంగా స్పందించింది. ఈ ఉగ్రవాద మిలీషియాను అడ్డుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కూటమి అధికార ప్రతినిధి కల్నల్ టుర్కీ అల్ మాల్కీ స్పష్టం చేశారు. అయితే యెమెన్‌పై సౌదీ వైమానిక దాడులను ప్రారంభించిందని హౌతీ ప్రతినిధి యహ్యా సరీ ఆరోపించారు. తమపై దాడులు జరిగితే ప్రతిదాడి తప్పదని హెచ్చరించారు.

## సముద్ర దిగ్బంధమే జవాబు

గల్ఫ్‌లో విస్తరిస్తున్న పోరు ఇప్పుడు అమెరికా-ఇరాన్ మధ్య ఆధిపత్య పోరుగా మారింది. ఆర్థిక ఒత్తిడిని పెంచేందుకు ఇరుదేశాలు వేర్వేరు దిగ్బంధ వ్యూహాలను అనుసరిస్తున్నాయి. హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచ మార్కెట్లకు చమురు సరఫరా కొనసాగేందుకు అమెరికా నౌకలకు మార్గనిర్దేశం చేస్తోంది. అదే సమయంలో ఇరాన్ చమురు ఎగుమతులను అడ్డుకునేందుకు జలసంధికి అవతల దిగ్బంధాన్ని కొనసాగిస్తోంది. దీనికి ప్రతిగా హోర్ముజ్‌ను మరింత కట్టడి చేసే చర్యలు చేపడతామని ఇరాన్ ప్రకటించింది. త్వరలో 'మారిటైమ్ ఎక్స్‌క్లూజన్ జోన్' వివరాలను వెల్లడిస్తామని తెలిపింది. ఈ ప్రాంతం అమెరికా దిగ్బంధ పరిధి నుంచి హోర్ముజ్ మీదుగా గల్ఫ్‌లోకి విస్తరించనుంది.

## అమెరికా యుద్ధ నౌకలపై

వారాంతంలో ఇరాన్ దాడులకు ప్రతిగా అమెరికా.. ఇరాన్ చమురు ట్యాంకర్లపై కాల్పులు జరిపింది. దీనికి ముందు అమెరికా యుద్ధ నౌకలపై ఇరాన్ దాడులు చేసినట్లు సమాచారం. తమ దాడుల్లో మరింత శక్తిమంతమైన కొత్త బాలిస్టిక్ క్షిపణులను వినియోగించినట్లు ఇరాన్ వెల్లడించింది. ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ.. అమెరికాకు తమ కొత్త క్షిపణుల సామర్థ్యంపై స్పష్టమైన హెచ్చరిక అందిందని పేర్కొన్నారు. అమెరికా సాగిస్తున్న ఆర్థిక యుద్ధానికి గల్ఫ్ అంతటా సముద్ర దిగ్బంధంతో సమాధానం ఇస్తామని హెచ్చరించారు.

## చమురు సరఫరాపై ఆందోళన

అమెరికా దాడులతో ఇరాన్ సంప్రదాయ సైనిక సామర్థ్యం దెబ్బతిన్నప్పటికీ.. ఆ దేశం వద్ద ఇంకా చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకోగల క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయి. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలపైనా వాటిని ఉపయోగించే సామర్థ్యం ఇరాన్‌కు ఉందని సమాచారం. యుద్ధానికి ముందు ప్రపంచంలోని మొత్తం చమురు, ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జీ) రవాణాలో దాదాపు ఐదో వంతు హోర్ముజ్ జలసంధి మీదుగా సాగేది. ఇప్పుడు ఈ మార్గంపై ఏర్పడిన ఆంక్షలు ప్రపంచ ఇంధన సరఫరాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

## అమెరికాలోనూ ధరల సెగ

యుద్ధం కారణంగా ముడి చమురు కొరతతో పాటు.. శుద్ధి చేసిన ఇంధనాల కొరత మరింత తీవ్రంగా మారింది. అమెరికాలో డీజిల్ ధరలు రికార్డు స్థాయికి చేరి.. గ్యాలన్‌కు సగటున 5.90 డాలర్లకు పైగా నమోదయ్యాయి. ఈ పరిణామం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ రాజకీయ భవిష్యత్తుపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే యుద్ధంలో విజయం సాధించిన వెంటనే చమురు ధరలు భారీగా పడిపోతాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన ధరలు గ్యాలన్‌కు మూడు డాలర్లకు.. చివరికి రెండు డాలర్లకంటే దిగువకు వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా చేస్తామని కూడా స్పష్టం చేశారు.

# ఆరు గ్యారంటీలు.. 420 హామీలు అమలు చేయాలి.

## అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల వినతిపత్రం

## కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం.. బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

సంగారెడ్డి, సెప్టెంబర్ 08 (నేటి నిజం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంగారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచనలతో పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరుపై ఖండన**

అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం, పోలీసు అధికారులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీకి వచ్చిన ప్రజాప్రతినిధులను నిర్బంధించడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, ప్రజా సమస్యలను ప్రస్తావించే హక్కు ఉంటుందని, ఆ హక్కులను అణచివేసే ప్రయత్నాలు సరికావని పేర్కొన్నారు.

**కేసీఆర్‌పై వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్నపల్లి శంకర్, వేముల వీరేశం చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంబంధిత ఎమ్మెల్యేలపై సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేయడం తగదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.

**రోడ్డుపై బైఠాయించి నిరసన.. నాయకుల అరెస్ట్**

అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. "ఆరు గ్యారంటీలు అమలు చేయాలి.. 420 హామీలు నెరవేర్చాలి" అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా చింతా సాయినాథ్, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజల పక్షాన ప్రశ్నించినంత మాత్రాన అరెస్టులు చేసి ఉద్యమాలను అణచివేయలేరని అన్నారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించిన వారిని అరెస్ట్ చేయడం కాకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ప్రభుత్వ బాధ్యత అని వారు పేర్కొన్నారు.

# వడోదరలో రూ.35వేల కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శ్రీకారం!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:: ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటనలో భాగంగా ఇవాళ (మంగళవారం) వడోదరలో రూ. 35,000 కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి దేశానికి అంకితం చేశారు. అనంతరం నవసారిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన, అధికారం, వ్యవస్థలు, హోదాలు కేవలం ప్రజాసేవ కోసమేనని స్పష్టం చేశారు.

సేవా దృక్పథమే బీజేపీ బలం: అధికారంలో ఉన్నామనే అహంకారం కాకుండా నిరంతరం ప్రజలకు సేవ చేయడమే బీజేపీ శ్రేణుల ప్రధాన సూత్రమని ప్రధాని ప్రశంసించారు. తమ పార్టీ కార్యకర్తలకు 'విశ్రాంతి అనేది నిషిద్ధం' అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, అది అనునిత్యం ఆచరించే జీవిత విధానమని పేర్కొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే శాశ్వత మార్పు: నవసారి జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ప్రధాని కొనియాడారు. సాధారణ పౌరుల భాగస్వామ్యంతో వచ్చే మార్పు మాత్రమే శాశ్వతంగా ఉంటుందని, అది సమాజంలో నూతన విశ్వాసాన్ని నింపుతుందని అన్నారు.

# అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల కేసు.. ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కు ఊరట..

హైదరాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డికి ఊరట లభించింది. వారిద్దరి రిమాండ్‌ను హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఈ మేరకు ఎమ్మెల్సీలకు బెయిల్ మంజూరు చేసింది. రూ. 20 వేల పూచీకత్తుతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని వారిని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 17కి వాయిదా వేస్తూ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆజ్ఞాపించింది. న్యాయస్థానం ఆదేశాలతో ష్యూరిటీలు సమర్పించిన తాతా మధు, నవీన్ రెడ్డిని పోలీసులు విడుదల చేశారు.

కాగా, తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి మొదలయ్యాయి. సమావేశాల తొలి రోజే అసెంబ్లీ ప్రాంగణం రణరంగాన్ని తలపించింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు రాసిన నల్ల దుస్తులు ధరించి, ప్లకార్డులు పట్టుకున్నారు. దీంతో వారిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. స్పీకర్ ఆదేశాల మేరకు చొక్కాలు మార్చుకుని రావాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు అసెంబ్లీ గేటు బయట బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో పోలీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి మండిపడ్డారు.

ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై దుర్భాషలాడినట్లు వార్తలు గుప్పుమన్నాయి. దళిత స్పీకర్‌ను అవమానించారంటూ అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు.

దీంతో అక్కడంతా గందరగోళంగా మారింది. మరోవైపు,

దీనిపై స్పందిస్తూ సభలోనే స్పీకర్ కంటతడి పెట్టుకున్నారు. కాంగ్రెస్ నేతల ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిపై కేసు నమోదు అయ్యింది. ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్టు చేసి హాజరుపర్చగా.. రిమాండ్‌కు నాంపల్లి కోర్టు తిరస్కరించింది.

# బీఆర్ఎస్ దాడిలో గాయపడ్డ మహిళా పోలీసులకు మంత్రి సీతక్క పరామర్శ



హైదరాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద నిన్న(సోమవారం) బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దాడిలో గాయపడ్డ మహిళా పోలీసులను మంత్రి సీతక్క పరామర్శించారు. జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను మంత్రికి మహిళా పోలీసు అధికారులు వివరించారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను అసభ్యంగా తాకారని.. దానికి సంబంధించిన విజువల్స్ చూపించి.. సీతక్కకు మహిళా పోలీసులు ఫిర్యాదు చేశారు.

'మా డ్యూటీలు మేము చేస్తుంటే టీ షర్టులు విసిరేసి మీది మీదికి వచ్చారు.. విధి నిర్వహణలో మేము చాలా ఇబ్బందులు పడ్డాం' అని మహిళా పోలీసులు వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక అంతు చూస్తామని బెదిరించారని ఆవేదన చెందారు. తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఫొటోలు, విజువల్స్ చూసి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి డ్యూటీలు చేయాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తోందని తెలిపారు. ఈ క్రమంలో మహిళా పోలీసులకు మంత్రి ధైర్యం చెప్పారు. 'ధైర్యంగా ఉండండి మా ప్రభుత్వం అండగా ఉంటుంది. మీ డ్యూటీ మీరు చేయండి. ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు' అని సీతక్క భరోసా ఇచ్చారు.

# అసెంబ్లీ వ్యవహారం.. హైకోర్టులో వాడీవేడి వాదనలు.. తీర్పు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 8: అసెంబ్లీ బయట జరిగిన ఘటనపై తెలంగాణ హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. నిన్నటి ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దంటూ పోలీసులను ఆదేశించింది ఎవరని న్యాయస్థానం ప్రశ్నించింది. ప్రతిపక్షాల ఎమ్మెల్యేలను అడ్డుకొని అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించారని ఏజీ సుదర్శన్ రెడ్డి న్యాయస్థానానికి తెలిపారు.

ప్లకార్డులు, వ్యతిరేక రాతలతో ఉన్న టీషర్టులు ధరించి అసెంబ్లీ లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారని ఏజీ చెప్పుకొచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని వెల్లడించారు. శాసనసభ్యుల నియమావళిని ఉల్లంఘించినందుకే పోలీసులు అడ్డుకున్నారని ఏజీ చెప్పారు. నిషేధాజ్ఞలను సైతం ఉల్లంఘించారని అన్నారు. విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లను సైతం దూషించారన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను కొంతమంది ఎమ్మెల్యేలు నెట్టివేసి అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారం అసెంబ్లీ స్పీకర్‌పై ఉంటుందని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. సభ సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని ఏజీ తెలిపారు. స్పీకర్ ఆదేశాల మేరకు చీఫ్ మార్షల్స్, పోలీసులు శాసనసభ్యులను అడ్డుకున్నారని ఏజీ వెల్లడించారు. బీఆర్ఎస్ శాసనసభ్యులు నల్ల టీషర్టులు ధరించి ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించేలా వ్యవహరించారని ఏజీ అన్నారు.

పోలీసులపైన చర్యలు తీసుకోవాలంటూ ఇచ్చిన ఆదేశాలు సవరించాలని ఏజీ హైకోర్టును కోరారు. పోలీసులైన దురుసుగా ప్రవర్తించిన వాళ్లపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించాలని అన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల ఎందుకు అనుచితంగా ప్రవర్తించారని హైకోర్టు ప్రశ్నించింది. ఓ సీనియర్ మహిళా ఎమ్మెల్యే మెడపై చేయి వేసి ఎందుకు నెట్టారని హైకోర్టు ప్రశ్నించింది. ఎవరితోనూ అలా ప్రవర్తించలేదని కోర్టుకు ఏజీ తెలిపారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ కౌంటర్ దాఖలు చేశాక పరిశీలిద్దామని ఏజీ న్యాయస్థానానికి చెప్పారు. నియమావళిలోని విషయాలను శాసనసభ్యులకు ఘటన కంటే ముందే తెలియజేశారా.? అని హైకోర్టు ప్రశ్నించింది.

అసెంబ్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు లేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది తెలిపారు. చీఫ్ మార్షల్స్‌కు స్పీకర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఎలాంటి ఉత్తర్వులు లేవని బీఆర్ఎస్ న్యాయవాది చెప్పారు. ఎమ్మెల్యేలు ఏదైనా నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారని.. కానీ పోలీసులు కాదని బీఆర్ఎస్ న్యాయవాది న్యాయస్థానానికి వివరించారు. నిన్న పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలనే రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్‌గా దాఖలు చేసిందని బీఆర్ఎస్ న్యాయవాది తెలిపారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారనుకుంటే సదరు ఎమ్మెల్యేలను స్పీకర్ దగ్గరకు తీసుకెళ్లాల్సి ఉండేదని బీఆర్ఎస్ చెప్పారు. అలా కాకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు ఎందుకు తీసుకెళ్లారని బీఆర్ఎస్ న్యాయవాది ప్రశ్నించారు. నిన్నటి కోర్టు ఉత్తర్వుల్లో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ న్యాయవాది చెప్పారు. ఇరువైపులా ముగిసిన వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది.

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

ముంబాయి, సెప్టెంబర్ 8: మహారాష్ట్రలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన మహారాష్ట్రలోని గోండా సిటీకి సమీపంలో, మహారాష్ట్ర-మధ్యప్రదేశ్ హైవేపై నగ్రా గ్రామం వద్ద మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో జరిగింది. మధ్యప్రదేశ్‌లోని కిర్నాపూర్, లాంజి తహసీల్ ప్రాంతాలకు చెందిన కొందరు కార్మికులు తమ కుటుంబాలతో కలిసి ఉదయం బొలెరో వాహనంలో తెలంగాణకు బయల్దేరారు.

హైదారాబాద్‌లో వీరంతా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరి వాహనం నగ్రా గ్రామానికి చేరుకోగానే.. హైవేపై ఎదురుగా, వేగంగా వస్తున్న ట్రక్కు బొలెరో వాహనాన్ని ఢీకొంది. ట్రక్కు వేగం ఎక్కువగా ఉండటంతో ప్రమాద తీవ్రత కూడా ఎక్కువగానే ఉంది. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. అందులో ముగ్గురు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు, అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చే లోగా గ్రామస్తులే సహాయక చర్యలు చేపట్టారు. తర్వాత అధికారులు, పోలీసులతో కలిసి క్షతగాత్రుల్ని బయటకు తీశారు. చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో బాధితులు నుజ్జునుజ్జయిన కారులోనే చిక్కుకున్నారు. వారిని బయటకు తీసేందుకు కార్‌ను కట్ చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా ట్రక్కు నడిపిన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ భాష, యాస కడు తియ్యన

## (09 సెప్టెంబర్ "తెలంగాణ భాషా దినోత్సవం" శుభ సందర్భంగా)

దేశ భాషల్లో తెలుగు భాష కడు తియ్యన. తెలుగు పలుకులు సంగీత స్వరాలు. తెలుగు భాషలో ప్రాంతీయ మట్టి వాసనలు, శ్రమజీవుల ఆత్మీయ కలయికతో పలు రకాల యాసలు పుట్టుకొచ్చాయి. తెలంగాణ ప్రాంతం శతాబ్దాలుగా పలు రాచరిక పాలనలు, ముఖ్యంగా నిజాం పాలనతో ఇక్కడి ప్రజల తెలుగు భాషలో ఉర్దూ, హిందీ, పర్షియన్, కన్నడ, మరాఠీ పదాలు మిళితమై ఈ భాష విలక్షణ రూపం దాల్చడం విశేషం. తెలంగాణ తెలుగు ఒక భాష మాత్రమే కాదు, ఇది గ్రామీణ శ్రమ జీవుల స్వేదంతో తడిసి విలక్షణ పద వాసనలను వెదజల్లుతున్నది. తెలంగాణ తెలుగు భాష, యాస, అందుకోని పలుకుబడులు ఇక్కడి జనుల జీవన విధానాలతో మమేకమై తియ్యదనాన్ని, అమాయకత్వాన్ని సంతరించుకున్నాయి. ఈ ప్రాంత ప్రజల సంస్కృతి, వారసత్వం, చారిత్రక వైభవం, పరాయి భాషా పదాల చేరికతో తెలంగాణ తెలుగుకు ప్రత్యేక సుగంధాలు అద్దబడ్డాయి. తెలంగాణ సామెతలు, పొదుపు కథలు, జాతీయాలు ఇక్కడి ప్రజల హాస్య గుణాలను, వ్యంగ్య రీతులను ప్రతిబింబిస్తున్నది.

### తెలంగాణ భాషా దినోత్సవం - 2026 :

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత ప్రముఖ తెలంగాణ ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ప్రతి ఏటా 09 సెప్టెంబర్ రోజున "తెలంగాణ భాషా దినోత్సవం" జరుపుకోవడం ఓ అద్భుత ఆచారంగా మారింది. కాళోజీ 100వ జయంతి సందర్భంగా 2014 నుంచి ఆయన జయంతి రోజు తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకోవడం కొనసాగుతున్నది. గొడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో 29 ఆగష్టు రోజున "తెలుగు భాషా దినోత్సవం" నిర్వహిస్తున్నారని మనకు తెలుసు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మన భాష ప్రాధాన పాత్రను పోషించింది. సీమాంధ్ర పాలకుల కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ తెలుగు భాషకు అవమానాలు, నిర్లక్ష నీడలు ఆవహించడం చూసాం, గొంతెత్తి జై తెలంగాణ అంటూ నినదించాం. మన సంస్కృతి వారసత్వాలను కూడా అవహేళన చేయడంతో మన రక్తం సలసల మరిగి పిడికి బిగించి రాష్ట్ర సాధనకు సిద్ధం అయ్యాం, సఫలీకృతం అయ్యాం.

### తెలంగాణ పొద్దుపు మన కాళోజీ :

తెలంగాణ పొద్దుపొడుపు కాళోజీ. తెలంగాణ తెలుగు భాష అస్తిత్వం నిలపడానికి కాళోజీ చేసిన కృషి మరువలేనిది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కాళోజీ వరంగల్‌లో స్థిరపడి తెలంగాణ మట్టి వాసనలను ఆస్వాదించడం, దాని ఔన్నత్యాన్ని గుర్తించి ఆ భాష అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. 09 సెప్టెంబర్ 1914 రోజు రంగారావు-రామాబాయమ్మలకు కర్ణాటకలో జన్మించిన కాళోజీ నారాయణ రావు కుటుంబం వరంగల్ మడికొండలో స్థిరపడిన ఒక నడిచే తెలంగాణ తెలుగు నిఘంటువు. ఒక కవన శిల్పి. రాజకీయ చైతన్య ప్రజాకవి. నిర్భయంగా భాషతో వాతలు పెట్టిన ప్రజావాది. హక్కుల కోసం పోరాడిన ప్రజల మనిషి. ఉద్యమాలు ఊపిరిగా శ్వాసించిన నిరాడంబర చలనశీలి. పుట్టుక, చావు నీది - జీవితం అంతా దేశానిది అన్న తెలంగాణ ఉద్యమ కెరటం. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలంతో గళమెత్తిన ధీరుడు. తెలంగాణ శ్రమజీవుల పక్షపాతి, మహా వైతాళికుడు మన కాలేజీ. స్వాతంత్ర్య సమరయోధుడు. తెలంగాణ ఉద్యమకారుడు.

### బహుభాషావేత్త ప్రజాకవి కాళోజీ :

"అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి - అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి" అన్న కాళోజీ కలం అక్షరాలకు ఆవేశం పుట్టించిన తీరు అనన్యసామాన్యం. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం పొందిన బహుభాషావేత్త మన కాళోజీ. రాజకీయ వ్యంగ్య కవిత్వం, తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆచారవ్యవహారాలు, ఆగ్రహం, పరాయి పాలనకుల వ్యతిరేకి అయిన కాళోజీ తన రచనలను ఆయుధాలుగా సాధించడంలో దిట్ట అని నిరూపించుకున్నారు. హైదరాబాద్, హన్మకొండల్లో చదివి ఉస్మానియా నుంచి న్యాయపట్టా గ్రొంరంధాలయోద్దాయమంలోమచురుకైన పాత్రను పోషించారు. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలు పాలైయ్యారు. 1940లో రుక్మిణీబాయిని వివాహం చేసుకున్నారు. పి వి నర్సింహారావుతో సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నారు. నిజాం పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. తల్లి చనిపోయిన తర్వాత అన్న ఉర్దూ కవి కాళోజీ రామేశ్వరరావు పెంపకంలో ఎదిగారు. 1958లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నిక అయ్యారు.

### విశిష్ట పురస్కారాల సుగంధ మాల :

సాహితీవేత్తగా కాళన్న చేసిన పలు రచనల్లో నా గొడవ, ఇదీ నా గొడవ, జీవన గీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, బాపు బాపు బాపు, కాళోజీ కథలు లాంటివి ముఖ్యమైనవి. కాళోజీ నారాయణ రావు జీవితం తెలంగాణ ప్రజలకే అంకితం. ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వ పద్మ విభూషన్ (1992), తామ్రపత్రి పురస్కారం (1972), ఏపీ ప్రభుత్వ అనువాద పురస్కారం (1969), బూర్గుల రామకృష్ణారావు మెమోరియల్ పురస్కారం (1981), తెలంగాణ ప్రజలకే ప్రేమగా ప్రజా కవి బిరుదు, పలు సాహితీ సంఘాల పురస్కారాలు, కాకతీయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్(1992), రామినేని/గాడిచర్ల ఫౌండేషన్ అవార్డు, గురజాడ అవార్డు(1996), మద్రాస్ కళాసాగర్ పురస్కారం (1996) లాంటివి ఎన్నో కాళోజీ చేతుల్లోకి చేరి మురిసిపోయాయి.

"హింస తప్పు - రాజ్య హింస మరీ తప్పు" అంటూ "సామాన్యుడే నా దేవుడు" అన్న కాళోజీ 13 నవంబర్ 2002 రోజు తుది శ్వాస విడిచారు. ఆయన కోరిక మేరకు తన పార్థివ దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అందజేసి చనిపోయిన తర్వాత కూడా ప్రజలకు సేవలు అందించిన మహానుభావుడు. ఆయన అందించిన విశిష్ట సేవలకు ప్రతిగా ప్రభుత్వం వరంగల్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, హనుమకొండలో సమావేశ మందిరానికి కాళోజీ కళాక్షేత్రం అని పేరు పెట్టడం జరిగింది.



-మధుపాళీ
9949700037

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత... భారత్ అంతటా ఉన్నత విద్యావకాశాలను విస్తరించింది: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 8:గువాహాటి విశ్వవిద్యాలయంలో రూ.110 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ఈ రోజు శంకుస్థాపన చేశారు. వీటిలో మల్టీడిసిప్లినరీ విద్యాభవనం, బాలురు, అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహం, ఆడిటోరియం, గ్రంథాలయానికి సంబంధించిన పనులు ఉన్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగించారు. గువాహటి విశ్వవిద్యాలయానికున్న చారిత్రక ప్రాధాన్యాన్ని వివరించారు. 'భారతరత్న గోపీనాథ్ బోర్డోలోయ్ లాంటి ప్రముఖ నాయకుల నేతృత్వంలో జరిగిన ప్రజా ఉద్యమం ఫలితంగా ఈశాన్య భారతదేశంలో మొదటి విశ్వవిద్యాలయంగా 1948 జనవరి 26న గౌహతి విశ్వవిద్యాలయం ప్రారంభమైంది. న్యాక్ ఏ ప్లస్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్-2025లో రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో తొమ్మిదో ర్యాంకుతో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థగా ఈ విశ్వవిద్యాలయం ఎదిగింది' అని ఆయన తెలియజేశారు.

భారతీయ భాషా వారసత్వాన్ని పరిరక్షించేందుకు విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. నాగరికత జ్ఞాపకాలు, జ్ఞానం, గుర్తింపు భాషలో ఉంటాయన్నారు. అస్సామీ, తమిళ రచనల పరస్పర అనువాదాలను ఆయన స్వాగతించారు. అస్సాం, తమిళనాడు మధ్య విస్తృతమైన విద్య, సాహిత్య ఆదాన ప్రదానాలను ప్రోత్సహించారు. సాంస్కృతిక ఐక్యతతో భారతదేశ భాషా వైవిధ్యం సుసంపన్నమవుతుందన్నారు.

బ్రహ్మపుత్ర బేసిన్‌లో అంతరించిపోతున్న భాషలు, బహుభాషా విధానం, మహిళల అధ్యయనాలు, పర్యావరణ సుస్థిరత, భారతీయ జ్ఞాన వ్యవస్థలపై విశ్వవిద్యాలయం చేస్తున్న పరిశోధనను శ్రీ సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. పర్యావరణ, ఆర్థిక, నాగరికత శక్తిగా బ్రహ్మపుత్రను వర్ణించారు. ప్రాంతీయంగా, జాతీయంగా ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడంలో పరిశోధనకున్న ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు.

2014 నుంచి భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థలో విస్తరణ గురించి శ్రీ సీపీ రాధాకృష్ణన్ వివరించారు. దేశవ్యాప్తంగా విద్యావకాశాలను విస్తరించడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వాన్ని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. దేశంలో నూతన ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఎయిమ్స్, ఇతర సంస్థల ఏర్పాటు గురించి ప్రస్తావించారు. అలాగే ఉన్నత విద్యలో మహిళల నమోదు 2014-15లో 1.57 కోట్ల నుంచి 2023-24 నాటికి 2.24 కోట్లకు అంటే 42.2 శాతం పెరిగిందని ఆయన తెలియజేశారు. పెరుగుతున్న మహిళల భాగస్వామ్యాన్ని, విద్యారంగంలో వారు సాధిస్తున్న విజయాలను సాధికారతకు ఒక ముఖ్యమైన సూచికగా అభివర్ణించారు.

ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలో అస్సాం సాధిస్తున్న పురోగతిని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. ముఖ్యంగా మౌలిక వసతులు, అనుసంధానం, విద్య, పెట్టుబడులు, ఉపాధి రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని అభినందించారు. రాష్ట్రంలో మెరుగుపడిన విద్యారంగం, ఐఐఎం గువాహటిలో ఎంబీయే తొలి బ్యాచ్ ప్రారంభం, 2021 నుంచి ప్రతిభ ఆధారంగా చేపట్టిన 1.64 లక్షలకు పైగా ప్రభుత్వ నియామకాల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వికసిత్ భారత్ - 2047 లక్ష్యానికి తోడ్పాటును అందించాలని విద్యార్థులు, పరిశోధకులకు శ్రీ సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. ధైర్యంగా కలలు కనాలని, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా పరిశోధనలను చేపట్టాలని, సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి సేవ చేసేలా చూడాలని, సమ్మిళితాభివృద్ధికి ఆవిష్కరణలను వాహకంగా మార్చాలని సూచించారు. స్వామి వివేకానందుని ఉటంకిస్తూ.. "మేల్కొనండి, లేవండి, మీ లక్ష్యం చేరే వరకు ఆగకండి" అని యువతను కోరారు.

ఈ సందర్భంగా అంకురన్ దత్త, నాని గోపాల్ మహంత సంపాదకత్వం వహించిన భూపేర్ హజారికా: హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ ఏ వాండరింగ్ సాంగ్స్ పుస్తకాన్ని, సవరించిన, మెరుగుపరిచిన చంద్రకాంత అభిధాన్ అయిదో సంచికను శ్రీ సీపీ రాధాకృష్ణన్ వివరించారు.

అస్సాం సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేస్తూ.. గువాహటి విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఉపరాష్ట్రపతి వీక్షించారు. విద్యార్థులతో, ఈ కార్యక్రంలో పాల్గొన్నవారితో ఆయన 'నో టు డ్రగ్స్' ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, క్రమశిక్షణ పాటించాలని, సమయాన్ని తెలివిగా సద్వినియోగం చేసుకోవాలని, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని పరిమితం చేసుకోవాలని ఉపరాష్ట్రపతి కోరారు. అస్సాం గవర్నర్ శ్రీ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మ, విద్యా శాఖ మంత్రి డాక్టర్ రనోజ్ పెగు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కోట, గువాహాటి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీ నాని గోపాల్ మహంత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఉత్పల్ శర్మ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, ఇతర విశిష్ట అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్సీపై చర్యలకు రాస్తారోకో

ఆదిలాబాద్, సెప్టెంబర్ 8: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నేత, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు చేపట్టిన ఆందోళనతో రహదారిపై కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం తాతా మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించగా స్థానిక ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలోని పోలీసులు అడ్డుకున్నారు. దిష్టిబొమ్మ దగ్ధాన్ని పోలీసులు భగ్నం చేయడంతో ఆందోళనకారులు, పోలీసుల మధ్య కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు లక్ష్మీనారాయణ, ఫసిహుల్లాతో పాటు పలువురు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచుల ముందస్తు అరెస్టులు..



ఆదిలాబాద్, సెప్టెంబర్ 8:తమ న్యాయమైన హక్కుల సాధన కోసం తెలంగాణ ఉపసర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ పిలుపు మేరకు చేపట్టిన 'హలో ఉపసర్పంచ్' కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీకి వెళ్తున్న ముగ్గురు ఉపసర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

కెరమెరి మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు సయ్యద్ రిజ్వాన్‌తో పాటు సుర్దాపూర్ ఉపసర్పంచ్ బామ్నే సాగర్, కొఠారి ఉపసర్పంచ్ ఆనందరావులను పోలీసులు తెల్లవారుజామునే అదుపులోకి తీసుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడంపై ఉపసర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సయ్యద్ రిజ్వాన్ మాట్లాడుతూ.. పోలీసులతో కలిసి అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన తమ ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ఉపసర్పంచులకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, గ్రామ వార్డు సభ్యులకు రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ తీర్మానాల కాపీలపై ఉపసర్పంచ్ సంతకం కూడా ఉండేలా నిబంధనలు మార్చాలని, ఉపసర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం గడువును నాలుగు సంవత్సరాలకు పొడిగించాలని కోరారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## 33 శాతం రిజర్వేషన్ మహిళల రాజకీయ నాయకత్వానికి కొత్త బాటలు వేస్తుంది: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు చారిత్రక అవసరమని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాల్సిన ఆవశ్యకతను వివరించారు. వివిధ ప్రభుత్వ సేవలు, వృత్తుల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండడాన్ని ప్రస్తావిస్తూ.. మున్ముందు రాజకీయం, పరిపాలన, సామాజిక రంగాల్లో నవతరం మహిళా నాయకత్వం రూపుదిద్దుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవల్లో 50 శాతానికి పైగా మహిళల భాగస్వామ్యం నమోదయ్యే రోజు మరెంతో దూరంలో లేదని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో ఫరీదాబాద్‌లో.. 'లింగ సమానతా పాలన' అంశంపై రెండు రోజుల అఖిల భారత నైపుణ్య శిక్షణ సదస్సును ఈ రోజు ప్రారంభిస్తూ శ్రీ ఓం బిర్లా ఈ వ్యాఖ్యలు చేశారు. కేవలం అవకాశాలను, మద్దతును అందించడానికే పరిమితం కాకుండా... విధానాలు, చట్టాల రూపకల్పన, సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలు క్రియాశీలక భాగస్వాములయ్యేలా దిశానిర్దేశం చేయడంపై ఇక నుంచి దృష్టి సారించాలని శ్రీ ఓం బిర్లా అభిప్రాయపడ్డారు. తమ ఆందోళనలను పరిష్కరించుకోవడానికి, స్వీయ ఆకాంక్షలకు అనుగుణంగా.. అవసరమైన చట్టాలను నిర్దేశించడంలో మహిళలే స్వయంగా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. రాజ్యాంగబద్ధ సమానత్వంతోపాటు.. మహిళల భద్రత, సాధికారత, ఆత్మనిర్భరత దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక చట్టబద్ధమైన చర్యలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఎప్పటికప్పుడు గుర్తించి, తగిన పరిష్కార మార్గాలను సుగమం చేయడంలో జాతీయ మహిళా కమిషన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసన సభలతో పాటు పంచాయతీలు, పురపాలక సంస్థల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా ప్రతినిధులు.. మహిళల సమస్యలను సరైన వేదికలపైకి తేవడంలో, క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా చట్టాలు రూపుదిద్దుకునేలా చేయడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించాలని శ్రీ బిర్లా ఉద్ఘాటించారు. భారత జనాభాలో దాదాపు సగభాగం గా ఉన్న మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత లేకుండా.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని దేశం సాధించలేదని శ్రీ ఓం బిర్లా స్పష్టం చేశారు. ప్రతి మహిళకూ ఉపాధి, ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారత కోసం అవకాశాలు లభించాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా పేదరికాన్ని, ఇబ్బందులను ఎదుర్కొంటున్న మహిళలను ఆర్థికంగా, సామాజికంగా సాధికారులను చేసేందుకు ప్రభావవంతమైన విధానాలు, పథకాలు, చట్టపరమైన చర్యలపై విస్తృతంగా చర్చించాలని మహిళా ప్రజాప్రతినిధులకు ఆయన పిలుపునిచ్చారు. వివిధ చట్ట సభల ప్రభావవంతమైన కార్యక్రమాలను, వారు సాధించిన విజయాలనూ అనుభవాలనూ పరస్పరం పంచుకోవడం ద్వారా.. ఉత్తమ విధానాలను దేశవ్యాప్తంగా అమలు చేయడానికి వీలవుతుందని సూచించారు. అంతేకాకుండా ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లోని మహిళలకు తమ సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉన్న చట్టాలు, సంస్థాగత వ్యవస్థలపై మరింత అవగాహనను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటం, దేశ నిర్మాణం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతం వరకు... దేశ పరిణామక్రమంలో మహిళలు ఎల్లప్పుడూ ముందంజలో ఉన్నారని శ్రీ ఓం బిర్లా గుర్తుచేశారు.

## పెంచికల్‌పాడులో సీసీ కెమెరాల ఏర్పాటు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 8: దొంగతనాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్సై జి. నరేష్ అన్నారు. మండలంలోని పెంచికల్‌పాడు గ్రామంలో నాలుగు సీసీ కెమెరాలను సోమవారం ఎస్సై జి. నరేష్, స్థానిక సర్పంచ్ కదం హిమ్మత్ రావు పటేల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా 100 మందితో సమానమని, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను మరింత సమర్థంగా నియంత్రించవచ్చని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా భద్రతను పెంచడంతో పాటు నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఎస్సై సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన పెంచికల్‌పాడు గ్రామస్తులను అభినందించారు. రానున్న గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యంగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బద్ది పోచమ్మకు భక్తుల బోనాల జాతర

**శ్రావణమాసం ముగింపు వేళ అమ్మవారికి భారీగా బోనాలు.. 50 వేల మందికిపైగా భక్తుల రాక**

వేములవాడ, సెప్టెంబర్ 8: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయంలో బోనాల జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగింది. శ్రావణమాసం ముగింపు సందర్భంగా మంగళవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సుమారు 50 వేల మంది భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించగా, కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. డిప్యూటీ ఈవో నవీన్‌కుమార్ ఆలయ పరిసరాల్లో పర్యటిస్తూ దర్శనం, క్యూలైన్లు, తాగునీరు తదితర సౌకర్యాలను పర్యవేక్షించారు. రానున్న రోజుల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా అదనపు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఆలయ సిబ్బందికి సహకరించి క్రమపద్ధతిలో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. శ్రావణమాసం ముగింపు వేళ బద్ది పోచమ్మ ఆలయంలో బోనాల జాతర వైభవంగా సాగింది.

# బూర్గంపహాడ్ లో భారీ గంజాయి పట్టివేత



ఖమ్మం, సెప్టెంబర్ 8: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ముందు సోమవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 18.30 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఎస్సై మెడ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం అదనపు ఎస్ఐ నాగభిక్షం ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిసుండగా ద్విచక్ర వాహనంపై అనుమానా స్పదంగా వెళ్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడిం ది.నింది తులను కర్ణాటక రాష్ట్రానికి చెందిన నవీన్ కుమార్ (శాహపూర్ గ్రామం), విజయ్ కుమార్ (మధుగిరి తాలూకా) గా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుండి 18.30 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# టీబీ పేషెంట్లకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి

## -అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి


ఖమ్మం, సెప్టెంబర్ 8:జిల్లాలోని ప్రతి టీబీ పేషెంట్‌కు ఆరు నెలలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిక్షయ్ కార్యక్రమం క్రింద టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సుమారు 3,000 మంది టీబీ పేషెంట్లు ఉన్నారని, ప్రతి పేషెంట్‌కు ఆరు నెలలకు సరిపడా పోషకాహారం అందేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు సత్యసాయి సొసైటీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రతి టీబీ పేషెంట్‌కు న్యూట్రిషన్ కిట్లు అందేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎక్కువ మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గతంలో సుమారు 12 వేల న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశామని, ప్రస్తుతం కిట్ల పంపిణీ సంఖ్య తగ్గిందని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సత్యసాయి సొసైటీలు ఈ అంశంపై సమీక్ష నిర్వహించి, జిల్లాలోని ప్రతి టీబీ పేషెంట్‌కు నిరంతరం పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు మాట్లాడుతూ క్షయ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవడానికి మందులతో పాటు మంచి పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నిక్షయ్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. న్యూట్రిషన్ కిట్లలో పల్లీలు, 1.5 కిలోల పప్పు, 1 కిలో బియ్యం, పావు కిలో వంట నూనె ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి -రవి పటేల్

## తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం



ములుగు, సెప్టెంబర్ 8:(నేటినిజం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ను సెకండ్ ఏఎన్ఎంలు కలిసి తమ సమస్యలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 5,000 మందికి పైగా సెకండ్ ఏఎన్ఎంలు గత 18 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ విధానంలో సేవలందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు.

దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సెకండ్ ఏఎన్ఎంల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. వారి సమస్యలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లి, ఆయనతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెకండ్ ఏఎన్ఎంలను తీన్మార్ మల్లన్నను కలిపి వారి సమస్యలను వివరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని, అలాగే ఏఎన్ఎం పోస్టుల భర్తీ విషయంలో పెండింగ్‌లో ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2012?13 నుంచి హామీ ఇస్తున్న పోస్టులతో పాటు అదనంగా 1,000 పోస్టులను భర్తీ చేయాలన్నది సెకండ్ ఏఎన్ఎంల ప్రధాన డిమాండ్లలో ఒకటని తెలిపారు.

అదేవిధంగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయడం మరో ప్రధాన డిమాండ్ అని రవి పటేల్ పేర్కొన్నారు. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకపోతే తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 5,000 మంది సెకండ్ ఏఎన్ఎంలతో కలిసి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామని అన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని రవి పటేల్ కోరారు.

ఈ కార్యక్రమంలో పులి శ్రీలత, చింత విజయ, ఉప్పమల్ల అనసూయ, అలుపుల కృష్ణవేణి, చడం భాగ్య తదితరులు పాల్గొని రవి పటేల్‌కు వినతిపత్రం అందజేశారు

# నేషనల్ హైవే-63 భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 8: నేషనల్ హైవే?63 గ్రీన్‌ఫీల్డ్ ఫోర్‌లేన్ రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ నీటిపారుదల శాఖ ఇంజనీర్ నారపరెడ్డి, భూ నిర్వాసితుల నాయకుడు తులా మధుసూదన్ డిమాండ్ చేశారు. మంగళవారం లక్షెట్టిపేట విశ్రాంతి భవనం ఆవరణలో భూములు కోల్పోతున్న రైతులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులు, ప్రస్తుతం నేషనల్ హైవే-63 గ్రీన్‌ఫీల్డ్ రహదారి కోసం మరోసారి భూములు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఇటీవల మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ అధికారులు భూములు కోల్పోతున్న రైతులకు నోటీసులు జారీ చేసి సమావేశానికి పిలిపించారని, కొన్ని దరఖాస్తులపై సంతకాలు తీసుకున్నారని పేర్కొన్నారు. రైతులకు పూర్తి అవగాహన కల్పించిన తర్వాతే తదుపరి ప్రక్రియ చేపట్టాలని కోరారు.

# బోధన సృజనాత్మకమనీ, దేశ నిర్మాణానికి గురువులు ముఖ్యమనీ చెబుతున్న కేంద్ర సహాయ మంత్రి వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:కేంద్ర సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌధరీ రాసిన వ్యాసాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో పంచుకున్నారు.

విద్యాబోధన ఒక కళ అనీ, ఈ వృత్తిలో ఉన్నవారికి మానవీయ సంబంధాలు, బోధనశాస్త్రం, విద్యార్థుల ప్రతిభను గుర్తించే సామర్థ్యం అవసరమంటూ కేంద్ర సహాయ మంత్రి రాశారని ప్రధానమంత్రి అన్నారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ 2020), 'ఉల్లాస్', 'విద్యాంజలి' వంటి వివిధ పథకాలు విద్యాబోధనను, జ్ఞ?న సంపాదనను ఎలా బలోపేతం చేస్తున్నదీ ఈ వ్యాసం చెబుతోందనీ, అలాగే దేశ నిర్మాణానికి ప్రతి గురువూ తోడ్పాటును అందిస్తున్న విషయాన్ని గుర్తిస్తోందనీ ప్రధానమంత్రి అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, ఇలా పేర్కొన్నారు:

"బోధన ఒక కళ, అది ఒక సృజనాత్మకతతో కూడుకున్నది.. మానవీయ సంబంధాలు, బోధన శాస్త్రం, విద్యార్థుల్లో దాగి ఉన్న శక్తియుక్తులను పసిగట్టే సామర్థ్యం గురువులకు అవసరమని కేంద్ర సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌధరీ అంటున్నారు.

దేశ నిర్మాణానికి ప్రతి గురువూ తోడ్పాటును అందిస్తున్నట్లు పేర్కొంటూ, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020, 'ఉల్లాస్', 'విద్యాంజలి' వంటి వివిధ పథకాలు విద్యాబోధనను, జ్ఞాన సంపాదనను ఎలా బలోపేతం చేస్తున్నదీ వివరించారు".

# ముంబయిలో '2026 గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్'ను ప్రారంభించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రేపు, అంటే 2026 సెప్టెంబరు 8న.. గుజరాత్, మహారాష్ట్రలలో పర్యటించనున్నారు. రూ. 35, 000 కోట్ల కన్నా ఎక్కువ విలువ గల వివిధ అభివృద్ధి పథకాలకు ప్రధానమంత్రి మధ్యాహ్నం సుమారు 12 గంటలకు, వడోదరాలో శంకుస్థాపన చేయడంతో పాటు ఆ పథకాలను దేశ ప్రజలకు అంకితమివ్వ నున్నారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్)ను ప్రధానమంత్రి ముంబయిలో సాయంత్రం దాదాపు 5 గంటల 45 నిమిషాలకు ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

## వడోదరాలో ప్రధానమంత్రి

వడోదరాలో ప్రధానమంత్రి వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ)లోని మూడు ప్రధాన భాగాలైన సానంద్ (ఎన్)-మకర్‌పురా, న్యూ ఉంబర్‌గావ్-న్యూ సఫాలే, న్యూ సఫాలే-జేఎన్‌పీటీ లను దేశ ప్రజలకు అంకితం చేస్తారు. దీని పొడవు 326 రూట్ కిలోమీటర్లు. దీనిని రూ.20,700 కోట్ల కన్న ఎక్కువ ఖర్చుతో నిర్మించారు.

జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జేఎన్‌పీఏ) ప్రత్యక్ష అనుసంధానంతో ఎగుమతి, దిగుమతి కార్గో రాకపోకలు వేగవంతం కానున్నాయి. పారిశ్రామిక కేంద్రాలకు, ఓడరేవులకు మధ్య సంధానం బలోపేతమవుతుంది. ఆధునిక వస్తు రవాణా వ్యవస్థకు పెట్టే ఖర్చు తగ్గుతుంది. ముంబయి రైల్వే నెట్‌వర్క్‌లో రద్దీని తగ్గించడానికి కూడా ఇది సాయపడనుంది.

వీటి ప్రారంభంతో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డీఎఫ్‌సీ) వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది. సరుకులను తీసుకుపోవ డానికి దోహదం చేసే రహదారుల వ్యవస్థ.. దేశ ఆధునిక వస్తు రవాణా విస్తారిత అనుబంధ వ్యవస్థతో ముడిపడిన బహువిధ సంధానాన్ని మెరుగుపరిచి, రవాణాకు పట్టే కాలాన్ని కుదించడంతో పాటు వివిధ ప్రాంతాలలో సరుకు రాకపోకలను సౌకర్యవంతంగా మార్చి దేశ లాజిస్టిక్స్ ఎకోసిస్టమ్‌ను మరింత పటిష్ఠపరుస్తుంది.

ముంబయిలోని న్యూ సానంద్ (ఉత్తర), న్యూ మకర్‌పురా, న్యూ ఉంబర్‌గావ్, న్యూ జేఎన్‌పీటీ నుంచి గూడ్స్ సేవలను కూడా ప్రధానమంత్రి ప్రారంభిం చనున్నారు. వడోదరా, టాండా రహదారి మధ్య నడిచే ఒక కొత్త రైలు సర్వీసును కూడా ప్రారంభిస్తారు. దీనితో వడోదరా, ఛోటా ఉదేపూర్, అలీరాజ్‌పూర్ జిల్లాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది.

చోటా ఉదేపూర్-ధార్ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధిపరిచిన కొత్త రైలుమార్గం జోబత్-టాండా రోడ్డును ప్రధానమంత్రి దేశ ప్రజలకు అంకితం చేస్తారు. ఈ కొత్త రైలు మార్గం అలీరాజ్‌పూర్‌కు చెందిన మారుమూల గిరిజన ప్రాంతాలను దేశ రైల్వే వ్యవస్థతో కలుపుతుంది.

ప్రధానమంత్రి మూడు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. రూ.9,700 కోట్ల కన్న ఎక్కువ ఖర్చుతో ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. వీటిలో.. వడోదరా-రత్లమ్ మూడో, నాలుగో లైన్లు, మియాగామ్ కర్జన్-చోరండా-మల్‌సర్ గేజ్ మార్పిడి, విశ్వమిత్రి-దభోయి డబ్లింగ్ ప్రాజెక్టులు భాగంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులతో ప్రయాణికుల చేరవేతతో పాటు, సరకు రవాణా సామర్థ్యం కూడా పెంపొందుతుంది. రద్దీ తగ్గుతుంది. గుజరాత్, మధ్యప్రదేశ్ మధ్య సంధానం బలోపేతమవుతుంది.

సుమారు రూ.1,780 కోట్ల ఖర్చుతో నిర్మించే మూడు జాతీయ రహదారి ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయను న్నారు. వీటిలో ఎన్‌హెచ్-48లో కామ్‌రేజ్-చల్‌థాన్ సెక్షన్లో ఆరు లేన్ల నిర్మాణం, ఎన్‌హెచ్-48లోనే వడోదరా-సూరత్ సెక్షన్లో తాపీ, నర్మదా నదుల మీద ప్రధాన వంతెనలు సహా అదనపు నిర్మాణాలు, ఎన్‌హెచ్-53లో అభవా, మింధోలా, ఖజోద్ జంక్షన్లలో గ్రేడ్-సెపరేటెడ్ నిర్మాణాలు ఉంటాయి. వీటికి తోడు, ఎన్‌హెచ్-48లో వడోదరా-సూరత్ సెక్షన్లో రోడ్డు భద్రతను మెరుగుపరచడానికి, రాకపోకలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించిన కందారీ చౌకడీ, లువారా పాటియా ఆరు లేన్ల ఫ్లయ్‌ఓవర్‌ను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

సుమారు రూ.2,600 కోట్ల ఖర్చుతో గుజరాత్ ప్రభుత్వం చేపట్టే వివిధ ప్రాజెక్టులకూ ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టుల్లో.. వడోదరా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రింగ్ రోడ్డు రెండో దశ, కడానా ఆనకట్ట మీద 110 మెగావాట్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, వడోదరా నగర పాలక సంస్థ కోసం ఒక కొత్త కార్యాలయ నిర్మాణం ఉన్నాయి. ప్రారంభించబోయే ప్రాజెక్టుల్లో.. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' (పీఎమ్ఏవై)లో భాగంగా గృహనిర్మాణ ప్రాజెక్టులతో పాటు తూర్పు వడోదరాలో 11 గ్రామాల అవసరాలను తీర్చడానికి ఉద్దేశించిన నీటి సరఫరా ప్రాజెక్టు తదితర ప్రాజెక్టులు ఉన్నాయి.

ముంబయిలో ప్రధానమంత్రి

'2026 గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్' (జీఎఫ్ఎఫ్)ను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ప్రపంచంలో అతి పెద్ద, ప్రభావశీల వార్షిక ఫిన్‌టెక్ సమావేశాల్లో జీఎఫ్ఎఫ్ ఒకటి.

ముంబయిలో జీఎఫ్ఎఫ్ ఏడో సంచికను ఈ నెల 8 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. జీఎఫ్ఎఫ్ ఓ 2020 మొదలు ఓ అంతర్జాతీయ వేదికగా ఎదిగింది. ఇది ఆర్థిక రంగ భవిష్యత్తు రూపురేఖలను తీర్చిదిద్దడానికి విధాన నిర్ణేతలను, నియంత్రణ సంస్థలను, కేంద్ర బ్యాంకులను, ఆర్థిక సహాయ సంస్థలను, ఫిన్‌టెక్ కంపెనీలను, సాంకేతిక సంస్థలను, ఇన్వెస్టర్లను, విద్యారంగ ప్రముఖులను, ఇతర అంతర్జాతీయ ఆసక్తిదారులను ఒక చోట సమావేశపరుస్తోంది.

ఈసారి జీఎఫ్ఎఫ్‌లో "ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటమ్ - సమ్మిళిత ఆర్థిక సాయానికి ఉద్దేశించిన విశ్వసనీయ, అనుసంధానిత, అంతర్జాతీయ వ్యవస్థలు..'ప్రభావం చూపించగల శక్తి' అంశాన్ని ప్రధానాంశంగా ఎంచుకున్నారు.

విధాన రూపకల్పన ప్రక్రియ, నియంత్రణ, సాంకేతికత, పెట్టుబడి, పరిశ్రమ.. వీటికి ఒక ఉమ్మడి వేదికను అందించే ఉద్దేశంతో '2026 జీఎఫ్ఎఫ్'ను నిర్వహిస్తున్నారు. డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితత్వం అంశాల్లో భారత్ నాయకత్వ భూమికను మరింతగా పెంపొందింప చేసి, ముందున్న అవకాశాలను వాస్తవ ప్రభావాన్ని ప్రసరించేవిగా మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఏజెంటిక్ ఏఐ, ప్రోగ్రామబుల్ ఫైనాన్స్, క్వాంటమ్ సాంకేతికత, తదితర ప్రధాన, సరికొత్త సాంకేతికతలను, అంతర్జాతీయ స్థాయిలో పౌరులు, వాణిజ్య సంస్థలతో పాటు ఆర్థిక వ్యవస్థల అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని విశ్వసనీయ, సమ్మిళిత, వాస్తవ ఫలితాలుగా ఆవిష్కరించడమెలాగన్న విషయంపై ఈ సమావేశంలో ముఖ్యంగా చర్చిస్తారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా విశ్రమించేది లేదు

ములుగు, సెప్టెంబర్ 8:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా విశ్రమించేది లేదని మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మండల అధ్యక్షులు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో ఎంతో సుభిక్షంగా ఉన్న ప్రజలు నేడు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలు గ్రహిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4000, దివ్యాంగులకు రూ.6000 పెన్షన్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, కౌలు రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగ భృతి వంటి ఎన్నో పథకాలను అమలు చేయకుండా నీరుగార్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం ములుగు జిల్లా జె ఏ సి అధ్యక్షులు దిడ్డి మోహన్ రావు, మండల ప్రధాన కార్యదర్శి పోగు నగేష్, నాయకులు పిన్నింటి యాదిరెడ్డి, గున్ను రెడ్డి, ఎల్లబోయిన రాకేష్, ఠాకూర్ సురేందర్, శివరాజ్, పత్తి గోపాల్ రెడ్డి, ఎండి రఫిక్ మొక్క భాస్కర్, సతీష్ చారీ, సూరి, నుశెట్టి రాము, వహీద్, లక్ష్మి నమ్మయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం

## శాస్త్రీయ అధ్యయనాలు, భద్రతా ప్రమాణాల సమగ్ర పరిశీలన అనంతరమే నిర్ణయం.-జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



ములుగు, సెప్టెంబర్ 8:(నేటినిజం ప్రతినిధి): యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.

మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వెంకటాపూర్ మండల పరిధిలో చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పనుల వల్ల కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవల్సిన చర్యలు, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాలపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారు.

ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. రామప్ప దేవాలయ పరిరక్షణ, పర్యావరణం, శాస్త్రీయ అధ్యయనాలు, నిరంతర పర్యవేక్షణతో పాటు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేశామని, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జీఎం జి. దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం పి. సైదులు, ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్. సునీత, పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు బి. గంగాదేవి, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు అజిత్ ఎం.ఎస్., వంశీకృష్ణ జ్యోతి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు జె. శ్రీధర్‌రావు, ఆచార్య ఎం.పాండురంగారావు, పాలంపేట సర్పంచ్ సీహెచ్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి కె. వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి రజని, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ, ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, వెంకటాపూర్ తహసిల్దార్ గిరి బాబు, ఎం పి డి ఓ రాజు, సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్‌కు ప్రశ్నించే అర్హత లేదు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 8:పదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ నాయకులకు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత లేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ గత వారం రోజులుగా చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని, ప్రజా సంక్షేమానికి కట్టుబడకపోవడంతోనే ప్రజలు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. దళిత ముఖ్యమంత్రి హామీ నుంచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వరకు అనేక హామీలను బడుగు, బలహీన వర్గాల అర్హులకు అందించలేదని ఆరోపించారు.

గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల ప్రయోజనాలను పార్టీ కార్యకర్తలకు అనుకూలంగా అందించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుందని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యవహరిస్తున్న తీరుపై వారు విమర్శలు చేశారు. పవిత్రమైన శాసనసభను రాజకీయంగా అవమానించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పెంచుతూ కేవీకేలను బలోపేతం చేసే కార్యాచరణ ప్రణాళికను సమీక్షించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

రాష్ట్రాల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడం ద్వారా కృషి విజ్ఞాన్ కేంద్రాలను (కేవీకే) బలోపేతం చేసే కార్యాచరణ ప్రణాళికపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ న్యూఢిల్లీలో ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025లో నిర్వహించిన అయిదో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సదస్సు వేదికగా.. కృషి విజ్ఞాన్ కేంద్రాలపై వచ్చిన కీలక సిఫార్సులపైనా, వాటి అమలును వేగవంతం చేసే చర్యలపైనా ప్రధానంగా చర్చించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ భగీరథ్ చౌదరి, వ్యవసాయ పరిశోధన - విద్యా విభాగ (డీఏఆర్ఈ) కార్యదర్శి, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్, మంత్రిత్వశాఖకు చెందిన సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

2027 మార్చి నాటికి ప్రాధాన్యతా ప్రాతిపదికన.. ఎంపిక చేసిన 300 కృషి విజ్ఞాన్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ వసతులను ఆధునికీకరించే కార్యాచరణపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వాలు క్రియాశీల భాగస్వామ్యం వహించి, సకాలంలో సహకారాన్ని అందించి.. నిర్ణీత కాలవ్యవధిలోగా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు దోహదపడాలని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ కోరారు. ప్రాధాన్యత క్రమంలో కేవీకేలను ఆధునికీకరించేందుకు అవసరమైన ఆర్థిక, సంస్థాగత మద్దతును కూడగట్టేందుకు వ్యవసాయ పరిశోధన - విద్యా విభాగం (డీఏఆర్ఈ) కార్యదర్శి ఇప్పటికే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులతో చర్చించారు. పలు రాష్ట్రాలు తమ పరిధిలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా ఈ ప్రక్రియను ప్రారంభించాయి. మహారాష్ట్ర, గుజరాత్, గోవా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు.. విశ్వవిద్యాలయాలు/ కేవీకేల నుంచి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు అందాయి. కాగా, ఇతర రాష్ట్రాలు ఈ నివేదికల తయారీ, అమలు ప్రక్రియల్లో వివిధ దశల్లో ఉన్నాయి.

అలాగే 2028 డిసెంబరు నాటికి అన్ని కృషి విజ్ఞాన్ కేంద్రాల్లో ఇంక్యుబేషన్ - నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలనే కార్యాచరణ అంశంపైనా సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమం కింద.. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, సాంకేతిక భాగస్వామ్య సంస్థలు, జిల్లాల వారీగా ఉన్న వ్యవసాయ అవకాశాలతో కృషి విజ్ఞాన కేంద్రాలను అనుసంధానిస్తున్నారు. నిధుల సమీకరణ, అమలులో భాగస్వామ్యం కోసం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సమర్పించేందుకు వీలుగా కేవీకేల వారీగా ప్రాజెక్టు ఇంక్యుబేషన్ ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

కేవీకే సిబ్బందికి సంబంధించిన సంస్కరణలపై వివరంగా చర్చించారు. సిబ్బంది జీతభత్యాలు, పదోన్నతులకు సంబంధించి ప్రతిపాదించిన సంస్కరణలకు వ్యయ విభాగం (డీవోఈ) ఆమోదం తెలిపింది. నిబంధనల ప్రకారం కేవీకే సిబ్బందికి ఎన్పీఎస్ కాంట్రిబ్యూషన్లు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. కృషి విజ్ఞాన్ కేంద్రాలు సమర్థంగా పనిచేయడానికి, నిర్దేశిత కార్యకలాపాలను పూర్తిస్థాయిలో నిర్వహించడానికి వీలుగా.. ఖాళీగా ఉన్న పోస్టులను సకాలంలో భర్తీ చేయాలని కేంద్ర మంత్రి రాష్ట్రాలను కోరారు. ముఖ్యంగా వ్యవసాయ కాలపరిమితి దాటకుండా ప్రణాళికాబద్ధమైన కార్యకలాపాలను అమలు చేయాలంటే.. కాలానుగుణ వ్యవసాయ కార్యక్రమాలకు సంబంధించి కృషి విజ్ఞాన్ కేంద్రాలకు సకాలంలో నిధులను విడుదల చేయడం ఎంత కీలకమైన అంశమో ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. 2026?27 సంవత్సరానికి గాను పప్పుధాన్యాలు, నూనెగింజలపై చేపట్టిన సమూహ క్షేత్రస్థాయి ప్రదర్శనల్లో (సీఎఫ్ఎల్‌డీ) భాగంగా.. 24 రాష్ట్రాల్లోని 353 కేవీకేలు/జిల్లాల ద్వారా 12,349 హెక్టార్ల లక్ష్యంతో కార్యకలాపాలను అమలు చేస్తున్నారు. ఇప్పటికే 9,750 హెక్టార్ల పరిధిలో లక్ష్యాన్ని సాధించారు. కొన్ని రాష్ట్రాల్లో నిధుల మంజూరులో జాప్యం, నిధుల ప్రవాహ మ్యాపింగ్ సమస్యలపైనా వివరంగా చర్చించారు. అటారీ, కేవీకే స్థాయిల్లో నిధులకు ఆటంకం లేకుండా, సకాలంలో చేరేలా చూడాలని రాష్ట్రాలను కోరారు. అలాగే సిఫార్సు చేసిన నాణ్యమైన విత్తనాలు, రకాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రదర్శనల రూపకల్పన, అమలులో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకానికి మద్దతుగా కృషి విజ్ఞాన్ కేంద్రాలు పోషించాల్సిన పాత్రను కూడా ఈ సమీక్ష సమావేశంలో ప్రముఖంగా చర్చించారు. నిర్దేశిత విధుల నిర్వహణతోపాటు, పీఎం ధనధాన్య కృషి యోజన కింద జిల్లా స్థాయి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికల అమలు కోసం.. కేవీకేలకు తగిన ఆర్థిక సహకారాన్ని అందించాలని రాష్ట్రాలను కోరారు. అలాగే సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలతోపాటు.. జిల్లా స్థాయిలో కేవీకేలు చేపట్టే కార్యకలాపాలను సేకరించి నిర్దేశిత పోర్టల్‌లో క్రమం తప్పకుండా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఫలితాల సమగ్ర పర్యవేక్షణ, నివేదికల రూపకల్పన, అంచనా ప్రక్రియలను ఇది సులభతరం చేస్తుంది.

కేంద్రం - రాష్ట్రాల మధ్య బలమైన సమన్వయం, సకాలంలో ఆర్థిక మద్దతు, ఆధునిక మౌలిక సదుపాయాలు, తగిన మానవ వనరులు, జిల్లాలవారీగా కార్యాచరణ ప్రణాళికల సమర్థమైన అమలుతోనే కేవీకేల్లో విప్లవాత్మక మార్పులను తీసుకురావడం సాధ్యమవుతుందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. రైతులకు సమర్థంగా సేవలందించేందుకు అత్యావశ్యకమైన మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, సంస్థాగత మద్దతుతోపాటు.. వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా అధిగమించేలా కృషి విజ్ఞాన్ కేంద్రాలు సన్నద్ధం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను, మెరుగైన ఉత్పాదక రకాలను, నైపుణ్యాలను, ఆవిష్కరణలను, వ్యవస్థాపక అవకాశాలను రైతులకూ గ్రామాలకూ చేరువ చేయడంలో శక్తిమంతమైన కృషి విజ్ఞాన్ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయి. అంగీకారం కుదిరిన కార్యాచరణ అంశాల అమలును.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వేగవంతం చేయాల్సిన ఆవశ్యకతను ఈ చర్చలు స్పష్టం చేశాయి. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తికి కేవీకేలు సమర్థమైన వేదికలుగా రూపుదిద్దుకునేలా కేంద్రం - ఇతర భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవస్థాపక ధోరణిని పెంపొందించడం, తద్వారా వికసిత, సమృద్ధ వ్యవసాయ రంగం ఆవిష్కృతమయ్యేలా భరోసానివ్వడంపై ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు.

# తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారి నిషిరకు చోటు

**ప్రతిభకు అవార్డు.. అభినందించిన జిల్లా కలెక్టర్**

కరీంనగర్, సెప్టెంబర్ 8: పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సోమిడి షాలిని, నటరాజ్ దంపతుల కుమార్తె చిన్నారి సోమిడి నిషిర తన ప్రతిభతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అవార్డు అందుకుంది. శ్లోకాలు, తెలుగు, ఇంగ్లిష్ రైమ్స్, మానవ శరీర భాగాలు తదితర అంశాలను చక్కగా చెప్పినందుకు నిషిరకు ఈ గుర్తింపు లభించింది. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి అవార్డును చిన్నారి నిషిరకు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

చిన్నారి నిషిర సాధించిన ఈ విజయంపై ఆమె తల్లిదండ్రులు సోమిడి షాలిని, నటరాజ్, నాన్నమ్మ మహేశ్వరి, తాత అక్కపాక తిరుపతి, అమ్మమ్మ మమతతో పాటు బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

# గణేష్ వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

**గణేష్ పోర్టల్-2026లో మండపాల నమోదు తప్పనిసరి**

**ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు, 24 గంటలూ వాలంటీర్ల ఏర్పాటు**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 8(నేటినిజం ప్రతినిధి): గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, స్థానిక కౌన్సిలర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గతేడాది నిమజ్జనం సందర్భంగా జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించి ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి గణేష్ మండప నిర్వాహకుడు గణేష్ పోర్టల్-2026లో మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి మండపం వద్ద 24 గంటలూ వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. మండపాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. 10 అడుగులకు మించిన ఎత్తు ఉన్న గణేష్ విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిమజ్జనం రోజున మండపం నుంచి నేరుగా నిర్దేశించిన ప్రాంతానికి వెళ్లి, నిర్ణీత సమయంలో నిమజ్జనం పూర్తి చేయాలని చెప్పారు. సిరిసిల్ల మానేరు తీరంలోని నిమజ్జన ప్రదేశంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగినన్ని క్రేన్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు వాటిని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహించే మండప నిర్వాహకులపైనా కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

# వేంసూరులో బీఆర్ఎస్ పోరుబాట




ఖమ్మం, సెప్టెంబర్ 8:అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ వేంసూరు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం భారీ ఆందోళన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో మర్లపాడు గ్రామంలోని పార్టీ కార్యాలయం నుంచి వేంసూరు అంబేద్కర్ విగ్రహం వరకు నల్లజెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చకు రాకుండా పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ శాసనసభ, స్పీకర్ పదవి పట్ల పూర్తి గౌరవం ఉందని, స్పీకర్‌ను లేదా శాసనసభను అవమానించడం తమ పార్టీ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు ప్రజా సమస్యలపై మాట్లాడే, నిరసన తెలిపే హక్కు ఉంటుందని అన్నారు.

పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో కాంగ్రెస్ నేతలు నిరసనలు తెలిపిన సందర్భాలను ప్రస్తావిస్తూ, అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఖండించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయలేదని సండ్ర విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి?షాదీ ముబారక్‌లో తులం బంగారం, పేదలకు ఇళ్ల వంటి హామీలను నెరవేర్చాలని కోరారు. రైతు భరోసా, రైతు బీమా, యూరియా సమస్యలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, దళితులు సహా అన్ని వర్గాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్రజా సమస్యలకు సంబంధించిన పలు వినతిపత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు సమర్పించారు.

# పుష్కరాల పనులు సమన్వయంతో పూర్తి చేయాలి

**గడువులోగా వేగవంతంగా పనులు సాగాలి**

**భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

కరీంనగర్, సెప్టెంబర్ 8:: గోదావరి పుష్కరాల కోసం చేపట్టాల్సిన అభివృద్ధి పనులను శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని




జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, దేవాదాయ ఆలయాల అభివృద్ధి, భూసేకరణ, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, కేశఖండనం, అన్నదానం తదితర అంశాలపై సమీక్షించారు. పుష్కరాల కోసం ప్రధానంగా రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, దేవాదాయ ఆలయాల అభివృద్ధి పనులతోపాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

పుష్కరాల కోసం ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.25 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పనులు టెండర్ దశలో ఉన్నాయని, టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పనులను సుమారు నాలుగు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

మంథని ఆలయాల సమూహ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో 15 అభివృద్ధి పనులు చేపటినట్లు పేర్కొన్నారు. గౌతమేశ్వర, సురబాండేశ్వర, ఓంకారేశ్వర, త్రిబంధేశ్వర, మహాలక్ష్మి తదితర ఆలయాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే 10 పనులకు టెండర్లు ఖరారయ్యాయని, డిజైన్ ఆమోదాలు పూర్తయ్యాయని, అవసరమైన పత్రాల ప్రక్రియ కూడా పూర్తయిందని వివరించారు.

పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపినందున వాటిపై నిరంతరం ఫాలోఅప్ చేస్తూ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన భూమిని త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘాట్ల నిర్మాణ పనులకు అవసరమైన చర్యలను ముందుగానే పూర్తి చేసి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఓదెల ఆలయ సంబంధించిన డిజైన్‌ను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ఏడీ సుప్రియ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలి

ఖమ్మం, సెప్టెంబర్ 8:తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై బీ.ఆర్.ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఎన్.ఎస్.యు.ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సురేష్ అజ్మీర గారి ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షులు సురేష్ అజ్మీర మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గారి గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని పేర్కొన్నారు.

స్పీకర్ గారిని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని ఎన్.ఎస్.యు.ఐ డిమాండ్ చేసింది. ప్రజా ప్రతినిధులు తమ హోదాకు తగిన విధంగా బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని, రాజకీయ విభేదాల పేరుతో రాజ్యాంగబద్ధ పదవులను అవమానించడం సరికాదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ నాయకులు వసీం పాషా, నాయకులు, కాటి సందీప్, లావుడియా గౌతమ్, ఉబ్బపల్లి నిఖిల్, షేక్ సమీర్, షేక్ అప్రోచ్ , సాయి, లక్కీ, షేక్ జమీల్, షాహిద్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు తగ్గుముఖం పట్టడంతో భారీగా పుంజుకున్న సీఐఎల్ ఉత్పత్తి, విద్యుత్ రంగ సరఫరాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:గనులు ఉన్న ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కోల్ ఇండియా లిమిటెడ్‌కు (సీఐఎల్) సంబంధించిన బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ రంగాలకు సరఫరాల విషయంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోంది.

సెప్టెంబర్ మొదటి మూడు రోజుల్లో సుమారు 1.36 మిలియన్ టన్నులుగా (ఎంటీ) ఉన్న సీఐఎల్ సగటు రోజువారీ బొగ్గు ఉత్పత్తి సెప్టెంబర్ 6 నాటికి సుమారు 35 శాతం పెరిగి 1.83 ఎంటీలకు చేరుకుంది. గనుల తవ్వకం పరిస్థితులు క్రమంగా మెరుగుపరచటం, దెబ్బతిన్న రవాణా మార్గాలు- పని ప్రదేశాలను పునరుద్ధరించటంతో ఈ వృద్ధి సాధ్యమైంది. ఈ ఉత్పత్తి వృద్ధి చెందటంలో సీఐఎల్ అనుబంధ సంస్థలు ప్రధాన పాత్ర పోషించాయి. ఇదే సమయంలో సగటు రోజువారీ ఉత్పత్తి 'ఎన్‌సీఎల్'లో 0.18 ఎంటీల నుంచి 0.29 ఎంటీలకు (సుమారు 61 శాతం), 'ఎస్ఈసీఎల్'లో 0.15 ఎంటీల నుంచి 0.20 ఎంటీలకు (33 శాతం) పెరిగింది.

ఉత్పత్తిలో వృద్ధి వల్ల సరఫరా మరింత పెరిగింది. విద్యుత్ రంగానికి బొగ్గు సరఫరా విషయంలో స్పష్టమైన మెరుగుదల కనిపిస్తోంది. విద్యుత్ రంగానికి సగటు రోజువారీ సరఫరా (డిస్పాచ్) సెప్టెంబర్ మొదటి మూడు రోజుల్లో సుమారు 1.37 ఎంటీలుగా ఉండగా.. సెప్టెంబర్ 6 నాటికి 24 శాతం పెరుగుదలతో 1.7 ఎంటీలకు చేరుకుంది. ఇదే సమయంలో విద్యుత్ రంగ సరఫరా ఎన్‌సీఎల్ విషయంలో 0.18 ఎంటీల నుంచి 0.28 ఎంటీలకు (56 శాతం).. ఎస్ఈసీఎల్ విషయంలో 0.30 ఎంటీల నుంచి 0.37 ఎంటీలకు (23 శాతం) పెరిగింది.

ఓబీఆర్ (ఓవర్‌బర్డెన్ రిమూవల్) గణనీయంగా పెరగటమే ఈ ఉత్పత్తి మెరుగుదలకు తోడ్పడుతోంది. బొగ్గు లభ్యత, భవిష్యత్ ఉత్పత్తి సన్నద్ధతకు ఓబీఆర్ ఒక ముఖ్యమైన సూచికగా ఉంది. సెప్టెంబర్ మొదటి మూడు రోజుల్లో రోజువారీ సగటు ఓబీఆర్ 2.5 మిలియన్ క్యూబిక్ మీటర్లుగా (ఎంసీఎం) ఉండగా సెప్టెంబర్ 6 నాటికి అది రెట్టింపు అయి 5.1 ఎంసీఎంలకు చేరుకుంది. ఇదే కాలంలో ఓబీఆర్.. ఎన్‌సీఎల్ విషయంలో నాలుగు రెట్లు, ఎస్ఈసీఎల్ విషయంలో మూడు రెట్లకు పైగా పెరిగింది.

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అదనపు బొగ్గును వెలికితీసేందుకు, ఓవర్‌బర్డెన్ తొలగింపును వేగవంతం చేయడానికి కావాల్సిన వనరులను తిరిగి కేటాయించటంతో పాటు పూర్తి స్థాయిలో మోహరించారు. నిరంతర నీటి తొలగింపు (డివాటరింగ్) ద్వారా దిగువ శ్రేణి బొగ్గు పొరలను క్రమంగా మళ్లీ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. వర్షాకాలంలో భౌగోళిక-సాంకేతిక ఇబ్బందులు ఎదురైన గనులకు పొడి వాతావరణ పరిస్థితులు తిరిగి రావడంతో ఇప్పుడు తెరుచుకుంటున్నాయి.

పొడి పని బెంచ్‌లు, పొడి ముడి బొగ్గు అందుబాటులోకి రావడం ఒక ముఖ్యమైన పరిణామం. తేమ, అతుక్కునే గుణం తగ్గడంతో బొగ్గును తరలించే విషయంలో (ఫ్రీ -ఫ్లోయింగ్) పరిస్థితి మెరుగుపడింది. ఇది మరింత సాఫీగా బొగ్గును నిర్వహించడానికి, రవాణా చేయడానికి వీలు కల్పిస్తుంది.

విద్యుత్ కేంద్రాలకు ముఖ్యంగా వాషరీ, ఆర్‌సీఆర్ పద్ధతి మోడ్ ద్వారా బొగ్గును పొందే కీలక ఉత్పత్తి కేంద్రాలకు సరఫరాను బలోపేతం చేయడానికి సీఐఎల్ అదనపు చర్యలు తీసుకుంటోంది. రోడ్డు మార్గంలో బొగ్గును తీసుకెళ్లటానికి ఆసక్తి గల కేంద్ర-రాష్ట్ర జెన్‌కోలు, ఐపీపీలకు ఎంఎస్‌క్యూ (మంత్లీ షెడ్యూల్డ్ క్వాంటిటీ) కంటే మించి బొగ్గును అందిస్తున్నారు. రోడ్డు మార్గంలో కీలక విద్యుతుత్పత్తి కేంద్రాలకు జారీ చేసిన డెలివరీ ఆర్డర్‌ల ఆధారంగా బొగ్గును తరలించటానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు.

గనులున్న అనేక ప్రాంతాల్లో బొగ్గు రవాణా మెరుగుపడ్డ పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

సీఐఎల్‌కు సంబంధించిన అన్ని గనుల్లో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న హాల్ రోడ్లు, బొగ్గు రవాణా మార్గాలను నిరంతరం బలోపేతం చేస్తున్నారు. సెప్టెంబర్ 3 నుంచి వర్షాలు తగ్గడంతో ఈ చర్యల ప్రభావం స్పష్టంగా కనిపించింది.

ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు, విద్యుత్ రంగ సరఫరా అన్నీ పుంజుకుంటుండటంతో కోలుకుంటున్న పరిస్థితిని మరింత మెరుగుపరచటం, బొగ్గు సరఫరాలను మరింత పెంచటంపై సీఐఎల్ దృష్టి సారించింది.

# ముప్పులను నిర్ణయాత్మకంగా ఎదుర్కొనే స్వేచ్ఛను, వనరులను రక్షణ బలగాలకు ఇచ్చాం: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:"శత్రు భూభాగంలో దాడులు చేయడంతో సహా ముప్పులకు నిర్ణయాత్మకంగా ప్రతిస్పందించేందుకు రక్షణ దళాలకు స్వేచ్ఛనూ, వనరులనూ అందించాం" అని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ చెప్పారు. న్యూఢిల్లీలో 2026, సెప్టెంబర్ 7న జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కాశ్మీర్ యువతను తప్పుదోవ పట్టించడం, భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు నిధులు సమకూర్చడం, హింస, ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడం, సమాజంలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నించడంతో సహా భారతదేశ భద్రతను దెబ్బతీయడానికి శత్రువులు ప్రయత్నిస్తున్నారని రక్షణ మంత్రి చెప్పారు. తప్పుదోవ పట్టిన యువతను తిరిగి ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం, వారికి పునరావాసాన్ని కల్పించడం, ఉగ్రవాద భావజాలం నుంచి దూరం చేసే చర్యలు చేపట్టడం, ఉపాధి, వ్యాపార అవకాశాలను అందించడం ద్వారా ఈ కుయుక్తులను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్రభుత్వం భగ్నం చేసింది. అన్ని విధాలుగా స్పందించింది.

370వ అధికరణను రద్దు చేసినప్పటి నుంచి జమ్ము, కాశ్మీర్ అపూర్వమైన పురోగతిని సాధించాయి. యువతకు కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయనీ, అవకాశాలు లభిస్తున్నాయనీ రక్షణ మంత్రి తెలిపారు. ఉగ్రవాదులనూ, వారి గుప్పిట్లో పెట్టుకుని ఆడించేవారినీ లక్ష్యంగా చేసుకొన్న సర్జికల్ స్ట్రయిక్, బాలాకోట్ ఎయిర్ స్ట్రయిక్, ఆపరేషన్ సిందూర్ లాంటి నిర్ణయాత్మక సైనిక చర్యల ద్వారా ఉగ్రవాదాన్ని ఏరివేసే వ్యూహాన్ని భారత్ స్వీకరించిందని ఆయన స్పష్టం చేశారు. "రక్తం, నీరు కలసి ప్రవహించలేవని సింధూ నదీ జలాల ఒప్పందం నిలిపివేత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది" అని ఆయన చెప్పారు.

భారతీయుల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టాలని శత్రువులు చేసిన ప్రయత్నాలను కూడా విజయవంతంగా తిప్పికొట్టామని శ్రీ రాజనాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రార్థనా స్థలాలపై జరిగిన దాడుల గురించి ప్రస్తావించారు. అలాంటి కుట్రలను భారతీయులు తిరస్కరించారనీ, ఐక్యతనూ, సామాజిక సామరస్యాన్నీ ప్రదర్శించారనీ తెలియజేశారు.

భారత్ శాంతి మార్గాన్ని విశ్వసిస్తుందనీ, యుద్ధాన్ని కోరుకోదనీ, ఏ దేశానికి చెందిన భూభాగాన్నైనా ఆక్రమించాలని అనుకోదనీ రక్షణ మంత్రి స్పష్టం చేశారు. శాంతియుతంగా ఉండటానికీ, బలహీనతకూ మధ్య స్పష్టమైన తేడా ఉందని ఆయన తెలియజేశారు. "యుద్ధ భయంతో పుట్టిన శాంతిని ఖండించాలి. కానీ శాంతి కోసం చేసే యుద్ధాన్ని గౌరవించాలి. భారత్‌కు వ్యతిరేకంగా ఏ దేశమైనా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే.. ఎలాంటి చర్చలూ జరపబోమని మేం స్పష్టంగా చెప్పాం. దానికి బదులుగా మా రక్షణ బలగాలు తగిన సమాధానం చెబుతాయి" అని చెప్పారు.

వేగంగా మారుతున్న యుద్ధ స్వభావం గురించి కూడా శ్రీ రాజనాథ్ సింగ్ మాట్లాడారు. భూమి, గాలి, సముద్రంతో సహా అంతరిక్షం, సైబర్ స్పేస్ కూడా ఆధునిక యుద్ధ క్షేత్రాలుగా ఆవిర్భవించాయన్నారు. కృత్రిమ మేధ, డ్రోన్లు, అటానమస్ వ్యవస్థలు, ఖచ్చితత్వంతో కూడిన ఆయుధాలు తదితర సాంకేతిక పరిజ్ఞానాలు యుద్ధభూమి రూపురేఖలు మారుస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు తగిన భద్రతా వ్యూహాన్నీ, రక్షణ పరికరాలను సిద్ధం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. దేశీయంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు.

ప్రతిస్పందన నుంచి క్రియాశీలకంగా భారత రక్షణ విధానం చేరుకుందని రక్షణ మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి దౌత్యం, నాయకత్వం కారణంగానే 2016లో క్షిపణి సాంకేతిక నియంత్రణ వ్యవస్థలో సభ్యదేశంగా భారత్ మారిందని వెల్లడించారు. ఇది బ్రహ్మోస్ క్షిపణి పరిధిని విస్తరించే ప్రయత్నాలకు దోహదపడిందనీ, ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలకపాత్ర పోషించిందనీ రక్షణ మంత్రి తెలిపారు.

రక్షణ రంగంలో వచ్చిన మార్పుల గురించి శ్రీ రాజనాథ్ సింగ్ వివరించారు. సరిహద్దు భద్రతను బలోపేతం చేయడం, రక్షణ బలగాలను ఆధునికీకరించడం, దేశీయంగా ఉత్పత్తిని పెంపొందించడం, ఆయుధాల ఫ్యాక్టరీలను పునరుద్ధరించడం దిశగా ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. ఈ ప్రయత్నాల వల్లే రక్షణ రంగంలో స్వయం సమృద్ధినీ, ఆత్మవిశ్వాసాన్ని దేశం సాధించిందనీ చెప్పారు. రక్షణ ఉత్పత్తుల విలువ 2014లో రూ. 40,000 కోట్లుగా ఉంటే ఇప్పుడు అది దాదాపు రూ.1.80 లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించారు. రక్షణ ఎగుమతులు 56 రెట్లు పెరిగి రూ. 38,000 కోట్లకు పైగా చేరుకున్నాయని తెలిపారు.

దిగుమతులు ఆధారిత విధానం నుంచి దేశీయంగా రక్షణ ఉత్పత్తులను తయారు చేయడం, ఆత్మనిర్భరతను సాధించడంపై భారత్ దృష్టి సారించిందని రక్షణ మంత్రి తెలియజేశారు. "స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఎయిర్ డిఫెన్స్ కంట్రోల్ సిస్టమ్ 'ఆకాశ్‌తీర్', అత్యాధునిక గగనతల క్షిపణి 'ఆకాశ్' ఇప్పుడు మన భద్రతా బలగాల వద్ద ఉన్నాయి. పినాకా రాకెట్ లాంచర్, గగనతలం నుంచి గగనతలానికి ప్రయోగించే 'అస్త్ర', 'ప్రచండ్', 'ధృవ' లాంటి స్వదేశీ హెలికాప్టర్లు, 'తేజస్' యుద్ధ విమానం, 'అర్జున్' ట్యాంక్, ఆధునిక డ్రోన్, కౌంటర్ డ్రోన్లు కూడా మన వద్ద ఉన్నాయి. వీటిన్నింటితో పాటు తొలి స్వదేశీ యుద్ధ వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ భారత నౌకాదళంలోకి ప్రవేశించింది. ఇప్పుడు మనం విస్తృత స్థాయిలో రక్షణ సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నాం. అదే సమయంలో ఆరో తరం యుద్ధ విమానాన్ని అభివృద్ధి చేస్తున్నాం. మన రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను 2029 నాటికి రూ.50,000 కోట్లకు చేరాలన్నదే మన లక్ష్యం" అని చెప్పారు.

రక్షణ తయారీ రంగంలో వచ్చిన మార్పుల గురించి శ్రీ రాజనాథ్ సింగ్ తెలియజేశారు. ఇప్పుడు 16 రక్షణ రంగ ప్రభుత్వ సంస్థ (డీపీఎస్‌యూ)లు నష్టాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయనీ, పరిశోధన, అభివృద్ధిలో పెట్టుబడులను పెంచుతున్నాయనీ, ఎగుమతులకు నూతన అవకాశాలను అన్వేషిస్తున్నాయనీ వెల్లడించారు. "గడచిన 12 ఏళ్లలో భారత రక్షణ బడ్జెట్ రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.8 లక్షల కోట్లకు పెరిగింది. పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో భారత దేశ భద్రతను బలోపేతం చేసేందుకే ప్రతి రూపాయినీ వినియోగిస్తున్నాం" అని చెప్పారు.

గత 12 ఏళ్లలో భారతదేశ భద్రత, ప్రాదేశిక సమగ్రత, సాంస్కృతిక గుర్తింపు బలోపేతమయ్యాయని రక్షణ మంత్రి అన్నారు. "అంతర్జాతీయ యోగా దినోత్సవం, నలంద విశ్వవిద్యాలయ పునరుద్ధరణ, అంతర్జాతీయ సౌర కూటమి, అంతర్జాతీయ జీవ ఇంధనాల కూటమి లాంటి కార్యక్రమాల ద్వారా నాగరికత నాయకత్వ స్థానాన్ని భారత్ చేరుకుంది. వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ సమ్మిట్, మహాసాగర్ (మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ అక్రాస్ రీజియన్స్) ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాల వాణిని బలోపేతం చేస్తున్నాం. పొరుగు దేశాల్లో సంక్షోభం ఎదురైతే మొదట స్పందించే విశ్వసనీయ దేశంగా భారత్ ఆవిర్భవించింది" అని రక్షణ మంత్రి తెలియజేశారు.

ఆర్థిక వ్యవస్థకూ, జాతీయ భద్రతకూ మధ్య ఉన్న సంబంధం గురించి శ్రీ రాజనాథ్ సింగ్ తెలియజేశారు. ఆధునిక సైనిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడానికీ, వ్యూహాత్మక స్వతంత్రతను కొనసాగించడానికి బలమైన ఆర్థిక వ్యవస్థ అవసరమన్నారు. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేస్తూ, స్వావలంబనను పెంపొందిస్తూ, దేశీయంగా తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తూ 7.8 శాతం వృద్ధి రేటుతో భారత్ ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించే ప్రయత్నాలకు ఉదాహరణగా భారతీయ సెమీకండక్టర్ వ్యవస్థ అభివృద్ధినీ, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని చూపించారు. "భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నడుమ, అనేక దేశాలు ఒక పక్షాన్ని ఎంచుకోవాల్సి వస్తుంది. లేదా నిర్దిష్ట కూటములతో పొత్తు పెట్టుకోవలసి వస్తుంది. అయితే, భారతదేశం తన సొంత ప్రాధాన్యతలపై దృష్టి సారిస్తూ స్వతంత్రతతో, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తితో ముందుకు సాగుతోంది. అందుకే ఈ రోజు మన ప్రపంచం వింటోంది," అని ఆయన అన్నారు.

రక్షణ ఉత్పత్తుల రంగంలో పెరుగుతున్న ప్రైవేటు రంగ భాగస్వామ్యం గురించి రక్షణ మంత్రి వివరించారు. "ఈ రంగంలో ప్రస్తుతం 16,000కు పైగా ఎంఎస్ఎంఈలు పని చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా రక్షణ తయారీ పరిశ్రమ విస్తరిస్తోంది. ఉత్తరప్రదేశ్, తమిళనాడుల్లో రక్షణ పరిశ్రమ కారిడార్ల కోసం సుమారుగా రూ.70,000 కోట్ల విలువైన ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో ఇప్పటికే దాదాపు రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టారు" అని చెప్పారు. ఐడెక్స్, ఐడెక్స్ ప్రైమ్ లాంటి కార్యక్రమాల ద్వారా రక్షణ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, 2018లో డజన్ల సంఖ్యలో మాత్రమే ఉన్న రక్షణ రంగంలోని అంకురసంస్థల సంఖ్య ఇప్పుడు 2,000కు పైగా పెరిగిందని చెప్పారు.

ఉద్యోగాలు కల్పించేవారుగా, ఆవిష్కర్తలుగా యువత మారాలని శ్రీ రాజనాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ప్రయోజనం కలిగించే ఆలోచనలకు రక్షణ మంత్రిత్వ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను బలోపేతం చేయడానికి పరిశ్రమ, విద్యాసంస్థలు, అంకురసంస్థలు, శాస్త్రవేత్తలను ఏకం చేసేందుకు డీఆర్‌డీవో చేస్తున్న ప్రయత్నాలను ఆయన అభినందించారు. మేలో విజయవంతంగా నిర్వహించిన స్క్రామ్‌జెట్ కంబస్టర్ పరీక్షలను... హైపర్‌సోనిక్ క్షిపణి అభివృద్ధి దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన క్షిపణి సాంకేతికతలను భారత పరిశ్రమకు బదిలీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీనివల్ల ప్రైవేట్ సంస్థలు వాటిని తయారు చేయడానికి వీలవుతుందని, అలాగే రక్షణ దళాలకు సకాలంలో అవి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను సాధించడం, జాతీయ భద్రతను బలోపేతం చేసే, ఆర్థిక వృద్ధిని నడిపించే, అంతర్జాతీయ భద్రతా వ్యవస్థలో దేశం పాత్రను పటిష్టచేసే రక్షణ రంగాన్ని సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడమే కాకుండా... సాంకేతిక, ఆర్థిక, రక్షణ రంగాల్లో మన దేశం ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# డీజే సౌండ్‌కు ఎలాంటి అనుమతులు లేవు

నిజామాబాద్, సెప్టెంబర్ 8: వినాయక చవితి సందర్భంగా నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్‌కు ఎలాంటి అనుమతులు లేవని బిక్కనూర్ ఎస్సై అనిల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వినాయకుడిని మండపం నుంచి నిమజ్జనానికి తీసుకెళ్లే సమయంలో, ముఖ్యంగా నిమజ్జనం రోజు డీజే సౌండ్‌ను వినియోగించవద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా డీజే సౌండ్ ఏర్పాటు చేస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సూచించారు. వినాయక మండపాల వద్ద భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎవరైనా మద్యం సేవించి పేకాట ఆడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని తెలిపారు.

వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే యువజన సంఘాల సభ్యులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి గ్రామంలో పోలీస్ సిబ్బంది ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారని ఎస్సై అనిల్ తెలిపారు.

# డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు పాటించాలి

నిజామాబాద్, సెప్టెంబర్ 8: జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు బడా భీమ్‌గల్ గ్రామంలో గణేష్ మండపాల నిర్వాహకులతో ఎస్సై సీహెచ్. తిరుపతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజేలు, డీజే మిక్సర్లు, హైఫై సౌండ్ సిస్టమ్‌లకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. లౌడ్‌స్పీకర్లను రాత్రి 10 గంటలకు తప్పనిసరిగా నిలిపివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లను నివారించేందుకు నాణ్యమైన వైర్లు, ఎంసీబీలు ఏర్పాటు చేయాలని, వర్షాల నేపథ్యంలో షెడ్లకు ప్లాస్టిక్ కవర్లు, బలమైన వేదికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భక్తుల రాకపోకలకు క్యూ, బారికేడ్లు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, మండపాల వద్ద కనీసం ఇద్దరు, ముగ్గురు నిర్వాహకులు నిరంతరం అందుబాటులో ఉండాలని తెలిపారు. పాయింట్ పుస్తకం నిర్వహించాలని సూచించారు.

అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక పాలనపై బీఆర్ఎస్ ఆందోళన




నిజామాబాద్, సెప్టెంబర్ 8: కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను నిరసిస్తూ జుక్కల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ఆందోళన నిర్వహించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో పాటు మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే నేతృత్వంలో అంబేద్కర్ చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హన్మంత్ షిండే మాట్లాడుతూ ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడం వారి హక్కులను కాలరాయడమేనని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించే చర్యలను బీఆర్ఎస్ సహించబోదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని తెలిపారు.

మహిళా ఎమ్మెల్యే పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని షిండే డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ముందుగా ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లను అమలు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు.

# డిండి లిఫ్ట్ ఎత్తిపోతల ప్రాజెక్టు రద్దు చేయాలి

**12న నాగర్‌కర్నూల్‌లో సత్యాగ్రహ దీక్ష**

**పాలక, ప్రతిపక్షాలు స్పందించాలి..**

**పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు పోరాటం చేయాలి**



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నీటిని తరలించేందుకు చేపట్టిన డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును రద్దు చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టుల సాధన సమితి డిమాండ్ చేసింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి వ్యవసాయయోగ్యమైన భూములకు సంపూర్ణంగా సాగునీరు అందించాలని కోరింది. పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, జూరాల, కల్వకుర్తి తదితర ఎత్తిపోతల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేసింది.

మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని దేవకి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కన్వీనర్ రాఘవాచారి, కో-కన్వీనర్ తిమ్మప్ప, ఇన్‌చార్జి శ్యాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు.

ఈ సందర్భంగా చైర్మన్ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 12న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌లో సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. దీక్షకు పాలక, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నేతలు, రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్యవాదులు, నీటి కోసం పోరాడాలనుకునే ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని చెబుతున్నప్పటికీ, ఆచరణలో 50 శాతం పనులు కూడా పూర్తికాలేదని ఆరోపించారు. ఇప్పటివరకు ఒక్క ఎకరా భూమికి కూడా నీరు అందలేదన్నారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుర్చీ వేసుకుని కూర్చుని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ.. అప్పటి పాలకులు, ఇప్పటి పాలకులు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.

నల్గొండ జిల్లాకు నీటిని తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రాజేందర్‌రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా ప్రజాప్రతినిధులు నీటి తరలింపుపై ఏకమవుతున్నప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు ఎందుకు ఏకం కావడం లేదని ప్రశ్నించారు. నీటి తరలింపును ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని, సత్యాగ్రహ దీక్షకు హాజరుకావాలని కోరారు.

కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ.. డిండి లిఫ్ట్ ప్రాజెక్టు మోసపూరితమైనదని, దీనిని వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వం ఈ అంశంపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. కృష్ణా జలాల నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు రావాల్సిన నీటిని నల్గొండ జిల్లాకు తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

ఈ విషయంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజల జీవనాధారమైన నీరందించాలని, నీటితో సమానమైన సంక్షేమ పథకం మరొకటి లేదన్నారు. పాలకులు స్పందించి న్యాయం చేయాలని, తమకు రావాల్సిన నీటి వాటాను దక్కించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం చేపట్టే పోరాటంలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాగునీటి అంశాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

# జీవో 97 రద్దు చేయాలి




నల్గొండ, సెప్టెంబర్ 8:రాష్ట్రంలోని డిప్లొమా సాంకేతిక విద్యను ప్రతిపాదిత స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం పునః పరిశీలించాలని నల్గొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం తరగతులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జీవో నంబర్ 97ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యను ప్రత్యేక సాంకేతిక విద్యా వ్యవస్థగానే కొనసాగించాలని, ప్రస్తుతం ఎస్‌బీటీఈటీ ఆధ్వర్యంలో అమలవుతున్న సిలబస్, పరీక్షలు, మూల్యాంకన విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. డిప్లొమా విద్యార్థులకు బీటెక్ లేటరల్ ఎంట్రీతో పాటు ఉన్నత విద్యకు ఉన్న అవకాశాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ విద్య సాధారణ నైపుణ్య శిక్షణకు భిన్నమైనదని, ఇంజినీరింగ్ పరిజ్ఞానం, ప్రాక్టికల్ శిక్షణతో పాటు ఉన్నత విద్యకు బాటలు వేసే ప్రత్యేక విద్యా విధానమని విద్యార్థులు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్య భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే ముందు విద్యార్థులు, అధ్యాపకులు, సాంకేతిక విద్యా నిపుణులతో ప్రభుత్వం విస్తృతంగా సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశారు.

# ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి

**–తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8:వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ కోరారు.

మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు.

డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామం, కాలనీలో వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని తెలిపారు

. రహదారులపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

రాత్రి 10 గంటల తర్వాత డీజేలు, సౌండ్ స్పీకర్లకు అనుమతి లేదని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


# వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

కర్నూలు సెప్టెంబర్ 8: హంద్రీనీవాలో వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సుంకేసులలో నీటి లభ్యత లేకపోవడంతో కే.సీ. కెనాల్‌కు నీటిని విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరిస్తూ మంత్రి ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 2న అధికారులు నిర్వహించిన సమీక్షలో ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే హంద్రీనీవాకు నీటిని తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారని మంత్రి పేర్కొన్నారు. అప్పట్లో చిన్న విగ్రహాలను మాత్రమే హంద్రీనీవాలో నిమజ్జనం చేసేందుకు వీలుంటుందని అధికారులు చెప్పారని తెలిపారు.

అయితే తాజాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం మరో 12 నుంచి 14 రోజుల వరకు హంద్రీనీవాకు నీటిని తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారని టీజీ భరత్ వెల్లడించారు. పెద్ద విగ్రహాలను సైతం నిమజ్జనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తామని అధికారులు చెప్పినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన తర్వాత 5వ రోజు, 7వ రోజు, 9వ రోజు హంద్రీనీవాలో నిమజ్జనం చేసుకునే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రధానంగా 5వ, 7వ రోజుల్లో నీటి లభ్యత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున నిమజ్జనానికి అత్యంత అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. 9వ రోజు నిమజ్జనానికి ఎంతమేర అనుకూల పరిస్థితులు ఉంటాయో ఇప్పుడే కచ్చితంగా అంచనా వేయలేమని తెలిపారు. నిమజ్జనం కోసం నన్నూరు టోల్‌గేట్, తాడకనపల్లె, ఉలిందకొండ వద్ద హంద్రీనీవాలో ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ మూడు ప్రాంతాల్లో ఏదో ఒక ప్రాంతాన్ని వినాయక నిమజ్జన కమిటీ ఎంపిక చేసి తెలియజేస్తే, గతంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిమజ్జన సమయంలో ఎలాంటి ఏర్పాట్లు చేసేవారో అదే విధంగా ఈ ఏడాది కూడా ఎంపిక చేసిన ప్రాంతంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

# తెలంగాణ విప్లవ తేజం కాళోజీ”

## సెప్టెంబర్ 9... తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకునే కాళోజీ జయంతి



“ఏ భాష నీది ఏమి వేషమురా,
ఈ భాష ఈ వేషమెవరి కోసమురా,
ఆంగ్లమందున మాటలనగానే
ఇంత కుల్కెదవెందుకు రా,
తెలుగు వాడివై తెలుగు రాదనుచు,
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు, సకిలించు ఆంధ్రుడా చావ వెందుకురా,”!...పర భాషలపై మోజుతో మాతృ భాషను విస్మరించే వారిని కాళోజీ కంటే గొప్పగా హెచ్చరించిన వారెవరూ లేరనేది వాస్తవం. అందుకే ఆయన జయంతి ‘తెలంగాణ భాషా దినోత్సవం’ అయింది.ఎక్కడో మరాఠాల కుటుంబంలో పుట్టి, వరంగల్‌కు వచ్చి స్థిరపడి ‘నాది బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష.. నా మాతృభాష తెలుగు’ అని ఎలుగెత్తిన పోరాట యోధుడు. భయం అనేది ఎరుగని కలం వీరుడు కాళోజీ. ఆయన తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచాడు. ఎన్నో సార్లు నిజాం ప్రభుత్వం కాళోజీని వరంగల్లు నుంచి బహిష్కరించింది.

”నా గురించి చెప్పు కోవాలంటే ఎక్కడ అన్యాయం జరిగినా ప్రతిఘటిస్తు వచ్చిన, అన్ని ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్న, ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొంభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయ రూపంలో ఉన్న స్టేటుమెంట్లే.”

అలాంటి కలం వీరుడిని జ్ఞాపకం చేసుకుని నివాళులు అర్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ (సెప్టెంబరు 9, 1914 - నవంబరు 13, 2002) “కాళోజీ నారాయణ రావు లేదా కాళోజీ లేదా కాళన్న” గా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడ బడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం రాసినా, హక్కులడిగినా, ఉద్యమం నడిపినా, ప్రజా వాణికి ప్రతిధ్వనిగా నిలిచాయన. మొత్తంగా తెలంగాణ జీవిత చలన శీలి కాళోజి. ఆజన్మాంతం తెలంగాణ ప్రజల అన్యాయాల గురించే తపించిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ఉద్యమ కారుడు. ఆయన 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది. వరంగల్ లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరు పెట్టబడింది.

‘అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి...అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు’ అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. ఆయన 1914, సెప్టెంబరు 9 న (కర్ణాటక) రాష్ట్రం, బీజాపూర్ జిల్లా లోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడపడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయిత గా ప్రఖ్యాతి గాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. ‘నా గొడవ’ పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహ మాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపు కడతాయి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం, గళం ఎత్తిన ఈ శతాబ్దపు మేటి కవి కాళన్న. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌమహల్ న్యాయ పాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండ లోని కాలేజియేట్ ఉన్నత పాఠశాల లోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939 లో హైదరాబాదు లో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయ రానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణా రావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింప జేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహా సభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్య సాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందుకు ఆయనకు నగర బహిష్కరణ శిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వ విద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర అనన్యం. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై, 1958 నుండి 60 వరకు పనిచేసారు. రెండేళ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా ఉన్నాడు. ఆయన “ఆంధ్ర సారస్వత పరిషత్” వ్యవస్థాపక సభ్యుడు మరియు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమిలో సభ్యుడు. ఆయన తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షునిగా, 1957-61 కాలంలో గ్లోసరీ కమిటీ సభ్యునిగా ఉన్నారు.

సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) నుండి స్వతంత్ర అభ్యర్థిగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పై పోటీ చేశాడు, కానీ ఓడిపోయాడు. కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. ‘హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు’ అంటూ “సామాన్యుడే నా దేవుడు” అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచాడు. ఆయన మరణా నంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అంద జేసారు. 1992లో పద్మ విభూషణ్ - భారత రెండవ అత్యున్నత పురస్కారం;

### 1972 లో తామ్రపత్ర పురస్కారం;

1968లో “జీవన గీత” రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారం; బూర్గుల రామకృష్ణా రావు మెమోరియల్ మొదటి పురస్కారం;ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చే 1981లో సత్కారం; “ప్రజాకవి” బిరుదు; ఆంధ్ర ప్రదేశ్ లో అనేక సాహితీ సంఘాలచే సన్మానాలు; రామినేని ఫౌండేషన్ అవార్డు; గాడిచర్ల ఫౌండేషన్ అవార్డు; కాకతీయ విశ్వ విద్యాలయంవరంగల్ వారు 1992 లో డాక్టరేట్; 1996లో సహృదయ సాహితీ విశాఖ వారి గురజాడ అవార్డు; 1996లో కళసాగర్ మద్రాస్ వారి విశిష్ట పురస్కారం పొందారు. ఆయన మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పండితుడు.

ఎన్నో ఇతర భాషా గ్రంథాలను తెలుగులో అనువదించాడు. 1943 లోనే ఆయన కథల్ని ‘‘కాళోజీ కథలు’’ పేరుతో అప్పట్లో హైదరాబాదులో ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీకి చెందిన అణా గ్రంథమాల సంస్థ తన పద్నాలుగో ప్రచురణగా ప్రచురించింది. ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర మహాసభ, తెలంగాణ రచయితల సంఘం సంస్థల నిర్మాణలలో కాళోజి భాగం ఉంది. పాములపర్తి

నరసింహారావు లాంటి ఎందరికో ఆయన సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గదర్శనం చేశాడు. విశాలాంధ్ర సమస్యలు గమనించి ఆయన 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కలిశాడు.

అన్ని సందర్భాలలో అసలుసిసలైన తెలంగాణ వాదిగా జీవించాడు. పర భాషా జ్ఞానాన్ని సంపాదించు కోవడం అవసరమే. కానీ, ఆ సాకుతో అమ్మ లాంటి మన భాషను నిర్లక్ష్యం చేయడం ఎంత తప్పు. నేటి తరం. తెలుగు పదాలనే మర్చిపోతోంది. ఈ పరిస్థితి పోవాలి.

తేట తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలి అని పరితపించాడు. తెలంగాణ పలుకు బడితో ప్రజల మాట, వ్యధలను ఆయన వ్యక్తం చేసిన తీరు అమోఘం. అందరికీ ఆదర్శ ప్రాయం.

కాళోజీ జయంతి సెప్టెంబర్ 9 ని “తెలుగు మాండలిక భాషా దినోత్సవం” గా జరుపుకోవడం సమంజసం.




-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

# శ్రీమద్ విరాట్ విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

## ఈనెల 15 నుండి 17 వరకు బ్రహ్మోత్సవాలు...



కరీంనగర్, సెప్టెంబర్ 8(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణం కమాన్ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోఈనెల 15 నుండి 17 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మంగళవారం రోజున ఆలయ కమిటీ సభ్యులు శ్రీమద్ విరాట్ విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి టెంపుల్ ఆలయ కమిటీ సభ్యులు, విశ్వకర్మ మరియు విశ్వబ్రాహ్మణ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. .మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా , ఘనంగా బ్రహ్మోత్సవాల ను నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీన ప్రారంభమయ్యే ఈ వేడుకలు సెప్టెంబర్ 17 వరకు వివిధ విశేష పూజలు, హోమాలు , సాంస్కృతిక కార్యక్రమాలతో కన్నుల పండుగ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. విశ్వబ్రాహ్మణ బంధువులందరూ ఈ దివ్య మహోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

# హెచ్‌పీవీ టీకాపై అవగాహన




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 8(నేటినిజం ప్రతినిధి): హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ (ఏఏఎఫ్ఏ) ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, కిడ్స్ కాన్వెంట్ పాఠశాలతో పాటు వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈ కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా హెచ్‌పీవీ వైరస్, దాని వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వ్యాక్సిన్ ప్రాధాన్యంపై విద్యార్థులు, పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. అపోహలను వీడి వ్యాక్సిన్‌పై సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు.కార్యక్రమాల్లో ఏఏఎఫ్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం విజయ్‌యాదవ్, జిల్లా కార్యదర్శి సాయి చరణ్, టౌన్ అధ్యక్షుడు కర్రు తిరుపతి, విక్రమ్‌యాదవ్, పిట్టల మనోహర్, పబ్బ రవి, పండుగ నితిన్, ప్రేమ్, శివాజీ, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

## డీజేలకు నో.. సీసీ కెమెరాలు తప్పనిసరి- గణేష్ పోర్టల్-2026లో మండపాల నమోదు తప్పనిసరి- ఎస్పీ మహేష్ బి గితే



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 8(నేటినిజం ప్రతినిధి): గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.సిరిసిల్ల పట్టణం లోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, స్థానిక కౌన్సిలర్లతో పోలీస్ శాఖ సమన్వయ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత ఏడాది నిమజ్జనం సందర్భంగా జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించారని తెలిపారు. అయితే జిల్లాలో అక్కడక్కడ ఇబ్బందులకు పాల్పడిన వారిపై ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పకడ్బందీ భద్రతా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పోర్టల్‌లో నమోదు తప్పనిసరి జిల్లాలోని ప్రతి గణేష్ మండప నిర్వాహకుడు గణేష్ పోర్టల్-2026లో మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవా లని ఎస్పీ సూచించారు. ప్రజా రవాణా, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ప్రతి మండపం వద్ద 24 గంటలూ వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మండపం వద్ద జరిగే కార్యక్రమాలకు నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు అన్ని మండపాలను జియో ట్యాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. భారీ విగ్రహాలకు ముందస్తు సమాచారం గణేష్ విగ్రహం ఎత్తు 10 అడుగులకు మించి ఉంటే ముందుగానే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. నిమజ్జనం రోజున మండపం నుంచి నేరుగా నిర్దేశిత నిమజ్జన ప్రదేశానికి వెళ్లాలని, కేటాయించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని చెప్పారు. సిరిసిల్ల మానేరు తీరంలో ఏర్పాటు చేయనున్న నిమజ్జన ప్రదేశంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన సంఖ్యలో క్రేన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు గణేష్ మండపాలు, శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. అనుమతి లేకుండా డీజేలు వినియోగిస్తే డీజే నిర్వాహకులతో పాటు సంబంధిత మండప నిర్వాహకులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాత్రి 10 గంటల వరకు మాత్రమే రెండు చిన్న స్పీకర్లను వినియోగించాలని సూచించారు.మండపాల వద్ద మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని, వాటిని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహించే మండప నిర్వాహకులపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండపాలను పోలీస్ అధికారులు, బ్లూకోల్ట్ సిబ్బంది తరచూ సందర్శించి పరిస్థితులను పర్యవేక్షిస్తారని తెలిపారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా గణేష్ ఉత్సవాల నేపథ్యంలో సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. విద్వేషాలను రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా అలాంటి పోస్టులను ఫార్వర్డ్ చేసే వారిపైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.సమావేశంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, పోలీస్ సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం.. ప్రతీ ఒక్కరూ నేత్రదానానికి ప్రతిజ్ఞ చేయాలి

## -మేయర్ కొలగాని శ్రీనివాస్




కరీంనగర్, సెప్టెంబర్ 8(నేటినిజం ప్రతినిధి) నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు, అపార్థాలను తొలగించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపే అవకాశం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం, జాతీయ నేత్రదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌కు చెందిన వాసన్ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నేత్రదాన అవగాహన సదస్సు, అవగాహన నడక నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదాన ఉద్యమంలో సేవలందిస్తున్న నేత్రదాతల కుటుంబ సభ్యులు, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సన్మానించారు.ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాసన్ ఐ కేర్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్నియల్ బ్లైండ్‌నెస్‌ను తగ్గించేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా చేపట్టిన ‘స్కాన్ అండ్ ప్లెడ్జ్’ కార్యక్రమాన్ని ప్రశంసించారు.“మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప అవకాశం నేత్రదానం ద్వారా లభిస్తుంది. నేత్రదానంపై ఉన్న అపోహలను వీడి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి” అని మేయర్ కోరారు.కరీంనగర్‌తో పాటు పొరుగు జిల్లాల నుంచి నేత్రదాతల కార్నియాలను సేకరించేందుకు వాసన్ ఐ కేర్‌లో 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ కార్నియా సేకరణ టెక్నీషియన్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నేత్రదాన ఉద్యమానికి వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమష్టిగా సహకరించాలని కోరారు.వాసన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ మైథిలి, డాక్టర్ టి. హరిత గౌడ్, డాక్టర్ శ్రీలేఖ నేత్రదానంపై ఉన్న అపోహలు, అపార్థాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా ఏఎస్‌జీ?వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్‌లో కొనసాగుతున్న ‘స్కాన్ అండ్ ప్లెడ్జ్’ కార్యక్రమం గురించి వివరించారు.అనంతరం నేత్రదాతల కుటుంబ సభ్యులు, వాలంటీర్లు, ఎన్జీవో ప్రతినిధులను మేయర్ కొలగాని శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ సెంటర్ మేనేజర్ వంశీ, వాసన్ ఐ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అరవింద్, సీనియర్ సిబ్బంది కిరణ్, ఆసుపత్రి సిబ్బంది, నేత్రదాతల కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అరెస్టులతో ప్రజాగొంతును అణచలేరు

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల తీరు దుర్మార్గం చెల్మెడ నర్సింహారావు- 500 మంది మహిళలతో నిరసన

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 8(నేటినిజం ప్రతినిధి): అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అడ్డుకుని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు.ఈ ఘటనను నిరసిస్తూ మంగళవారం వేములవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పద్మశాలి భవన్ నుంచి మెయిన్‌రోడ్, ఆలయ పురవీధుల మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు సుమారు 500 మంది మహిళలతో ర్యాలీ సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనన్నారు.మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజల కోసం ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపితే అడ్డుకుంటారా? అని ప్రశ్నించారు. ప్రజల గొంతును ఎవరూ అణచివేయలేరని స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు, పట్టణ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.